# విశాల భారతి

05-12-2025

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:3 సంచిక: 335




ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పట్టణంలో పర్యటించారు. ఆదిలాబాద్ కు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్, రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, గడ్డం వినోద్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు స్వాగతం పలిచారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధికి, మహిళా సంక్షేమం, విద్యా, భద్రతా రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు, మొత్తం రూ.260.45 కోట్ల నిధులను కేటాయించారు.

# ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తెస్తా

## సీఎం రేవంత్ రెడ్డి ఆదిలాబాద్ పట్టణంలో పర్యటించారు

- భద్రతా రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులకు శంకుస్థాపన
- తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- మొత్తం రూ.260.45 కోట్ల నిధులను కేటాయించారు
- ఈ ప్రాంతంలో అపారమైన సున్నపు గనులు ఉన్నాయి
- ఇక్కడ సిమెంట్ కంపెనీని మళ్లీ ప్రారంభిస్తాం
- ఏడాదిలో ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభిస్తాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డుల సమగ్ర అభివృద్ధికి రూ.18.70 కోట్లతో శంకుస్థాపన జరిపారు. ఇందిరా మహిళా శక్తి క్రింద స్వయం సహాయక మహిళా సంఘాలతో కలిసి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడానికి రూ.1.75 కోట్లు కేటాయించారు. అలాగే 160 స్వయం సహాయక మహిళా సంఘాలకు రుణాలుగా రూ.19.69 కోట్లను మంజూరు చేశారు. పట్టణ పరిధిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లతో శంకుస్థాపన జరిగింది. అదనంగా, మహాలక్ష్మి వాడ, విద్యానగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణం, ఆధునికీకరణకు రూ.2 కోట్లు కేటాయించబడ్డాయి.

పట్టణ భద్రతను బలోపేతం చేయడానికి కూడా సీఎం చర్యలు తీసుకున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్ నగర్‌లో 18 పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి రూ.11.93 కోట్లు, 3 ఇంటెలిజెన్స్ విభాగం క్వార్టర్స్‌కు రూ.2.6 కోట్లు, భరోసా కేంద్రం ఏర్పాటు కోసం రూ.2 కోట్లు కేటాయించారు. పట్టణ అభివృద్ధికి కీలకమైన అంశం స్థిరమైన విద్యుత్ సరఫరా, అందులో భాగంగా టీజీఎన్‌పీడీసీఎల్ ద్వారా కొత్త కలెక్టరేట్ సమీపంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.231.24 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు అయ్యాక ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. 2ఏళ్ల లో ఒక్క రోజైనా సెలవు తీసుకున్నానా అని ఆయన వ్యాఖ్యానించారు. చిన్న వయస్సులోనే అన్ని అవకాశాలు ఇచ్చారని, నిరంతరం శ్రమ చేస్తూనే ఉన్ననన్నారు సీఎం రేవంత్. దేవుడి సంకల్పం ఉంటే అన్ని సాధిస్తామని, తెలంగాణ రాష్టానికి సీఎంగా రెండేళ్లు ఎలాంటి ఆటంకాలు లేకుండా పాలన సాగిందని ఆయన తెలిపారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామని, బీజేపీ ఎమ్మెల్యే, ఎంపీ నగేష్ లను సభ వేదిక పైన మాట్లాడించామన్నారు. ఎందుకు అంటే మా లాగే వారిని ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, గతంలో ప్రతిపక్షం వాళ్ళను సంచివాలయంకు రానివ్వలేదు, ఇపుడు అలాంటి లేదు ఉండదని ఆయన వెల్లడించారు. తల్లి సోనియా ఆశీస్సులు తీసుకొని వచ్చానని, వంద దేశాలకు ఆతిధ్యం ఇస్తుండగా అందరిని కలసి ఆహ్వానించడం జరిగిందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయం ఉండాలి కదా.. ఆదిలాబాద్ కు ఎయిర్ పోర్టు ఉండాలి గా ఎయిర్ పోర్టు ఉండాలి అని ఆలోచించామన్నారు.

మిగతా 3లో..

## అఖండ 2.. సీఎం రేవంత్ హామీపై ఆశలు

### గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సినీ కార్మికులపై వరాల జల్లు కురిపించి

### ఇప్పుడు ఆ హామీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి

02

- అఖండ 2 సినిమా టికెట్ ధరలను పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు
- టికెట్ పెంపులో 20% కార్మికులకు అందిస్తామని సీఎం హీమీ
- అందుకు నిర్మాతలు అంగీకరిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది
- హామీ అమలుపై సినీ కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు
- ప్రీమియం షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించారు
- దీంతో ఐబొమ్మ రవికి మద్దతుగా కొందరు మాట్లాడుతున్నారు





## క్వాంటం ఎకానమీ లీడర్‌గా హైదరాబాద్

- హైదరాబాద్‌లో క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమం
- పాల్గొన్న భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- డిజిటల్, టాలెంట్‌కి హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు
- సీఎం రేవంత్ టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారని తెలిపారు
- రాబోయే రోజుల్లో ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని వెల్లడించారు
- రూ. 1000 కోట్ల స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు

02

## బంధం బలోపేతం

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ చేరుకున్నారు
- స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికారు
- స్వాగతం పలికేందుకు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టారు పీఎం మోదీ
- కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ తిలకించారు
- ప్రధాని మోదీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒకేకారులో వెళ్లారు
- ఈరోజు భారత్- రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశం
- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు అంశం ప్రస్తావించే అవకాశం ఉంది



03

## ఈ పంచాయతీలు మా వల్ల కాదు

- పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- అందులో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది
- ఇప్పటికే రెండు విడతల నామినేషన్ల ప్రక్రియ పూర్తి
- రిజర్వేషన్లు సరిగ్గా లేవంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేమంది

03



## రేవంత్ అవినీతి అనకొండ

- కార్మికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు కేటీఆర్
- రూ.5 లక్షల కోట్ల భారీ భూ కుంభకోణానికి తెరలేపారు
- ప్రభుత్వ భూములు ప్రవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు

03



## పోలీసు శాఖకు షాకిచ్చిన హ్యాకర్స్

- సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి
- తాజాగా హ్యాకింగ్ ముఠాలు తెగించేశాయి
- పోలీసు కమిషనరేట్ వెబ్‌సైట్లనే టార్గెట్ చేసుకున్నాయి
- ఈ వెబ్‌సైట్‌లు పూర్తిగా పనిచేయకుండా పోయాయి
- ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది
- విషయం తెలిసిన వెంటనే ఐటీ విభాగం రంగంలోకి దిగింది

02

## రూపాయి పాలిటిక్స్

- రూపాయి విలువ మహా పతనం కొనసాగుతోంది
- రూపాయి విలువ ఏకంగా రూ.90 దాటింది
- చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయికి చేరింది
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర విమర్శలు
- ప్రపంచంలోనే మన కరెన్సీకి విలువ లేకుకండా పోయింది
- అందుకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని ఆరోపణ

02



## డిసెంబర్ 7న ప్రజా వంచన దినం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు తీవ్ర విమర్శలు
- ప్రజా పాలన ఉత్సవాలను పూర్తిగా బహిష్కరిస్తున్నాము
- ఉత్సవాల పేరుతో ప్రజలకు మరింత మోసం చేసే ప్రయత్నం
- హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజలు నిరాశలో ఉన్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు ఎంతో భారీగానే ఉన్నాయి
- డిసెంబర్ 7ని ప్రజా వంచన దినంగా ప్రకటిస్తున్నాము

06







# అఖండ 2.. సీఎం రేవంత్ హామీపై ఆశలు

- గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సినీ కార్మికులపై వరాల జల్లు కురిపించి
- ఇప్పుడు ఆ హామీలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి
- అఖండ 2 సినిమా టికెట్ ధరలను పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు
- టికెట్ పెంపులో 20శాతం కార్మికులకు అందిస్తామని సీఎం హామీ
- అందుకు నిర్మాతలు అంగీకరిస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది
- హామీ అమలుపై సినీ కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు
- ప్రీమియం షో టికెట్ ధరను రూ.600గా నిర్ణయించారు
- దీంతో ఐబొమ్మ రవికి మద్దతుగా కొందరు మాట్లాడుతున్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

సినిమా ధరల పెంచిన సందర్భాల్లో పెంచిన టికెట్ ధరలో 20శాతం మూవీ వెల్ఫర్ అసోసియేషన్ కు అందించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీ అమలు అంశం మరోసారి చర్చనీయాంశమైంది. అఖండ 2 సినిమా టికెట్ ధరల పెంపుతో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో సినీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి సినిమా టికెట్ పెంపులో 20శాతం కార్మికులకు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ హామీ అనంతరం ప్రభుత్వం తాజాగా అఖండ 2 సినిమా టికెట్ ధరలను పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. పెంచిన టికెట్ ధరలో 20శాతం కార్మికుల సంక్షేమం కోసం మూవీ వెల్ఫర్ అసోసియేషన్ అందించాల్సి ఉంటుందని కూడా ప్ర



భుత్వం ఉత్తర్వులో పేర్కొంది. అయితే అందుకు నిర్మాతలు అంగీకరిస్తారా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇందుకు సంబంధించి విధివిధానాలు ఎలా ఉండనున్నాయి.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ అమలులో వస్తుందా అని సినీ కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

అఖండ 2 సినిమా టికెట్ ధరలు సింగిల్ స్క్రీన్‌లో రూ.50, మల్టీ ఫ్లెక్స్‌లో రూ.100ధర పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వెసులు బాటు కల్పించింది. డిసెంబరు 4న రాత్రి 8 గంటల ప్రీమియం షోకు కూడా అనుమతి ఇచ్చింది. ఈ టికెట్ ధరను రూ.600గా నిర్ణయించారు. అయితే, పెంచిన ధరలు విడుదల తేదీ నుంచి కేవలం మూడు రోజులు మాత్రమే అమల్లో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. పెంచిన టికెట్ ధరలలో ఉదాహారణకు రూ.600టికెట్ ధరపై 20శాతం కింద రూ.120 మూవీ వెల్ఫర్ అసోసియేషన్ కు ఇవ్వాల్సి ఉంటుంది.గతంలో సినీ కార్మికులు వేతనాల పెంపుకు నిర్మాతలు అంగీకరించలేదు.

ఈ సందర్బంగా మధ్యే మార్గంగా బెనిఫిట్స్ షోల ద్వారా వచ్చే ఆదాయంలో 20శాతం కార్మికుల ఫెడరేషన్ కు చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. ఆ లక్ష్యంతోనే ఆఖండ 2 సినిమా టికెట్ల ధరల పెంపుకు అనుమతించింది. అయితే పెంచిన టికెట్ ధరలపై 20శాతం కార్మికుల సంక్షేమానికి నిర్మాతలు అందించే విషయమై ఆసక్తి నెలకొంది.

టికెట్ రేట్లు పెంచేసి సినిమాలు చూడమంటే ఎలా అంటూ సామాన్య ప్రేక్షకులే కాదు సీపీఐ నారాయణ కూడా ప్రశ్నిస్తున్నారు. ఐబొమ్మ రవిని అరెస్ట్ చేసారు. అతని వలన ఎంతోమంది ప్రేక్షకులు ఉచితంగా సినిమా చూసారు. థియేటర్స్ లో ఫుడ్ ఛార్జ్ లు, టికెట్ రేట్లు అధికం ఇలా థియేటర్ కి వెళ్లి సినిమా చూస్తే జేబులకు చిల్లే. అందుకే ఐబొమ్మ రవి పైరసీని అందరూ ప్రోత్సహిస్తున్నారు. అతని అరెస్ట్ ని అందరూ ఖండిస్తున్నారు. ఆఖరికి రాజకీయ నేత సిపిఐ నారాయణ కూడా నేను ఐబొమ్మ లో సినిమా చూసాను, ఐదారొందలు పెట్టి థియేటర్ కి వెళ్లి సినిమాలు ఎవరు చూస్తారు. సినిమా విడుదల సమయంలో టికెట్ రేట్లు పెంచేస్తే థియేటర్ కి వెళ్లి సినిమా ఎందుకు చూస్తారు, అందుకే ఐబొమ్మ రవిలు పుడతారని కామెంట్స్ చేసి ఆయన మరోసారి అఖండ 2 టికెట్ రేట్ల పెంపు విషయంలో హాట్ కామెంట్స్ చేసారు. అఖండ2 సినిమా టికెట్ రేట్లు పెంచారు.. ఇలా రేట్లు పెంచడం వల్లే ఐబొమ్మ రవి లాంటి వాళ్ళు పుట్టేది, ఐబొమ్మ రవి లాంటి వాళ్ళను అరెస్ట్ చేసే నైతిక హక్కు ఈ ప్రభుత్వానికి లేదు, సినిమా టికెట్ రేట్లు పెంచి ప్రజలపై భారం వేసి, సంపన్న వర్గాలకు ఊడిగం చేస్తూ, సామాన్య ప్రజలను దోచుకుంటున్నారు అంటూ అఖండ 2 టికెట్ రేట్లపై నారాయణ ఓ రేంజ్ లో ఫైర్ అయ్యారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సినీ కార్మికుల సంక్షేమానికి ఒక వెల్ఫేర్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ సంక్షేమ నిధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే సినిమా నుంచి వచ్చే ఆదాయంలో కార్మికులకు 20 శాతం వాటా ఇవ్వాలని సినీ ఇండస్ట్రీకి సూచించారు. అంతేకాదు రాబోయే రోజుల్లో సినిమా టికెట్ల ధరలను పెంచాలనుకుంటే.. అందులో 20 శాతం వాటా సినీ కార్మికుల వెల్ఫేర్ ఫండ్‌కు ఇస్తేనే పర్మిషన్ ఇచ్చేలా జీవోలో నిబంధనలు సడలిస్తామని పేర్కొన్నారు. అలాగే నర్సరీ నుంచి 12వ తరగతి వరకు కార్పొరేట్ స్థాయిలో ఓ స్కూల్ నిర్మించి సినీ కార్మికుల పిల్లలకు చదువు చెప్పించే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్య సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో సినీ ఫైటర్స్ ట్రైనింగ్‌కు స్థలం కేటాయిస్తామన్నారు. సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభ కార్యక్రమంలో సీఎం రేవంత్ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు సినీ ఇండస్ట్రీని హైదరాబాద్‌కు తరలించేందుకు ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు.

డా. ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం మణికొండలో 10 ఎకరాల సొంత స్థలం ఇచ్చారని తెలిపారు. చిత్రపురి కాలనీ ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. చిత్ర పరిశ్రమలో కార్మికులు, కళాకారులు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని.. అందుకే దిల్ రాజుకు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించానని తెలిపారు. కొన్నేళ్ల క్రితం నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ అవార్డులు ఇస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళికలో ఫిల్మ్ ఇండస్ట్రీకి ప్రత్యేక చాప్టర్ ఉంటుందన్నారు. నవంబర్ చివరి వారంలో సినీ కార్మికుల సమస్యలపై మరోసారి సమావేశమవుతామని పేర్కొన్నారు.

# పోలీసు శాఖకు షాకిచ్చిన హ్యాకర్స్

- సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి
- తాజాగా హ్యాకింగ్ ముఠాలు తెగించేశాయి
- పోలీసు కమిషనరేట్ వెబ్‌సైట్లనే టార్గెట్ చేసుకున్నాయి
- ఈ వెబ్‌సైట్‌లు పూర్తిగా పనిచేయకుండా పోయాయి
- ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనంగా మారింది
- విషయం తెలిసిన వెంటనే ఐటీ విభాగం రంగంలోకి దిగింది
- ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పని చేస్తుంది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

సమాజంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. ఎలాంటి కఠిన చట్టాలను ప్రవేశ పెట్టినా లాభం లేకుండా పోతుంది. తాజాగా హ్యాకింగ్ ముఠాలు ఎంతకు తెగించాయి అంటే.. ఏకంగా పోలీసు కమిషనరేట్ వెబ్‌సైట్లనే టార్గెట్ చేసుకున్నాయి. దీంతో గత పది రోజులుగా ఈ వెబ్‌సైట్‌లు పూర్తిగా పనిచేయకుండా పోయాయి. జనాలు తీవ్రంగా ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. మొన్నటికి మొన్న హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసిన ఈ ముఠాలు.. ఇప్పుడు ఏకంగా కమిషనరేట్ వెబ్‌సైట్‌నే హ్యాక్ చేయడం సంచలనంగా మారింది. హ్యాకింగ్ ముఠాలు ఇప్పుడు సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లను టార్గెట్ చేశాయి. గత పది రోజుల నుంచి ఈ వెబ్‌సైట్‌లలోని లింకులు ఓపెన్ చేస్తే, అధికారిక సమాచారానికి బదులుగా బెట్టింగ్ సైట్‌లకు రీడైరెక్ట్ అవుతున్నాయి. జనాలు ఈ విషయాన్ని గమనించడంతో ఇప్పుడీ వార్త సంచలనంగా మారింది. కమిషనరేట్ వెబ్‌సైట్లు హ్యాక్ అయ్యాయనే విషయం తెలిసిన వెంటనే ఐటీ విభాగం రంగంలోకి దిగింది. ముందుగా ఈ రెండు కమిషనరేట్ల సర్వర్లను డౌన్ చేసి అవి సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలిస్తోంది. విషయం తెలియంతో ఈవెబ్‌సైట్‌ల నిర్వహణ బాధ్యతలు చూసే (నేషనల్ ఇన్‌ఫోరమాటిక్స్ సెంటర్) అలర్ట్ అయ్యింది.

ప్రస్తుతం ఎన్ఐసీ.. ఈ రెండు వెబ్‌సైట్ల హ్యాకింగ్‌కు కారణమైన ముఠాలను గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులతో కలిసి పని చేస్తుంది. అలానే ఈ సర్వర్‌ల భద్రతను బలోపేతం చేసే పనిలో నిమగ్నమైంది. ఒకేసారి రెండు విధులు నిర్వహిస్తోంది. గత కొంత కాలంగా ప్రభుత్వ శాఖలకు చెందిన వెబ్‌సైట్ల మీద వరుసగా సైబర్ దాడులుజరుగుతుండటంతో ఆయా విభాగాల్లో సైబర్ భద్రతపై కొత్త చర్చ మొదలైంది. అధికార వర్గాలు మాత్రం త్వరలోనే ఈ వెబ్‌సైట్‌లను పునరుద్ధరిస్తామని తెలిపారు. భవిష్యత్‌లో మరోసారి ఇలాంటి దాడులు జరగకుండా.. ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

కొన్ని రోజుల క్రితమే తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్ అయిన సంగతి తెలిసిందే. హైకోర్టు వెబ్‌సైట్ నుంచి ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుండగా సమస్య తలెత్తింది. దీనిపై క్లిక్ చేస్తే గేమింగ్ సైట్‌లోకి వెళ్తుందని రిజిస్ట్రార్ కంప్లైంట్ ఇచ్చారు. ఇదిలా ఉంటే.. దేశంలో ఆన్‌లైన్ గేములకు చెక్ పెట్టేందుకు గాను.. లోక్‌సభ కీలకమైన బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. దీని ప్రకారం ఇకపై ఎవరైనా ఆన్‌లైన్ గేమ్‌ల గురించి ప్రచారం చేసినా.. నిర్వహించినా, ప్రోత్సహించినా జైలుశిక్ష, భారీ జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో జైలుశిక్షతోపాటు జరిమానా కూడా విధించేలా కేంద్రం ప్రభుత్వం బిల్లును రూపొందించింది. ఇదిలా ఉండగా.. ఇటీవల సైబర్ నేరగాళ్లు తెలంగాణ హైకోర్టుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారు. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తున్న క్రమంలో ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ ఓపెన్ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులను ఆశ్రయించారు. పీడీఎఫ్ ఫైల్‌స్‌కు బదులు బీడీజీ స్లాట్ అనే బెట్టింగ్ సైట్ ఓపెన్ అవుతోంది అంటూ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత నెల 11వ తేదీన ఈ సంఘటన చోటుచేసుకుంది. 11వ తేదీనే హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెబ్‌సైట్ హ్యాక్ చేసిన వారిని కనుక్కునే పనిలో పడ్డారు. వెబ్‌సైట్‌లోని సమస్యను క్లియర్ చేశారు. తెలంగాణ హైకోర్టుకు చెందిన ఈ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రతీ కేసుకు సంబంధించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. హ్యాకర్లు ఏకంగా ఈ సైట్‌నే హ్యాక్ చేశారు.

# క్వాంటం ఎకానమీ లీడర్‌గా హైదరాబాద్

- హైదరాబాద్‌లో క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమం
- పాల్గొన్న భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- డిజిటల్, టాలెంట్‌కి హైదరాబాద్ కేంద్రంగా మారింది అన్నారు
- సీఎం రేవంత్ టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారని తెలిపారు
- రాబోయే రోజుల్లో ఏఐ ప్రపంచాన్ని శాసిస్తుందని వెల్లడించారు
- రూ. 1000 కోట్ల స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

హైదరాబాద్ లో నిర్వహించిన క్వాంటం పవర్డ్ ఎకానమీ స్ట్రాటజీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. క్వాంటం టెక్నాలజీ గురించి దేశం చర్చిస్తుంది.. దాని ఆవిష్కరణకి తెలంగాణను ఎంచుకున్నందుకు నీతి ఆయోగ్ కి ధన్యవాదాలు చెప్పుకొచ్చారు. డిజిటల్, టాలెంట్ కి హైదరాబాద్ కి కేంద్రంగా మారింది అన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా టెక్నాలజీని ప్రమోట్ చేసే పనిలో ఉన్నారు.. అయితే, రాబోయే రోజుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచాన్ని శాసిస్తుంది అని డిప్యూటీ సీఎం విక్రమార్క పేర్కొన్నారు. అయితే, తెలంగాణ 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఎకానమీకి చేరుకోవాలని ప్లాన్ చేస్తున్నాం అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. నీతి ఆయోగ్ కూడా గ్లోబల్ సమ్మిట్ లో భా



గస్వామ్యం కావాలని కోరుతున్నాం. ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అన్ని రంగాల పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం. యంగ్ ఇండియా స్టార్టప్ కోసం ఫండింగ్ చేయాలని నిర్ణయించాం.

1000కోట్ల రూపాయలతో స్టార్టప్ లను ప్రోత్సహిస్తామని భట్టి విక్రమార్క వెల్లడించారు. హైరాబాద్‌ను భవిష్యత్ క్వాంటం ఎకానమీకి ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న బలమైన డిజిటల్ ఆధారాలు, నైపుణ్యవంతమైన ఐటీ వర్క్‌ఫోర్స్, గ్లోబల్ కంపెనీలు ఏర్పాటు చేసుకున్న ఆర్‌అండ్‌డీ సెంటర్లు - ఇవన్నీ కలసి తెలంగాణను కొత్త తరం సాంకేతికతల హబ్‌గా నిలబెడుతున్నాయని తెలిపారు. క్వాంటం కంప్యూటింగ్, క్వాంటం కమ్యూనికేషన్, క్వాంటం సెక్యూరిటీ వంటి రంగాల్లో తెలంగాణ ముందుగానే దిశనిర్దేశం చేసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు వస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు, పరిశ్రమలు క్వాంటం టెక్నాలజీల వైపు సాగుతున్న ఈ సమయంలో, పరిశోధన, ఇన్నోవేషన్, హైఎండ్ స్కిల్స్ అభివృద్ధికి అవసరమైన వాతావరణం రాష్ట్రంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇదే నేపథ్యంలో హైదరాబాద్‌ను క్వాంటం ఎకానమీ లీడర్‌గా నిలబెట్టే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఐటీ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. దేక్వాంటం సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని చెప్పారు. క్వాంటం టెక్నాలజీలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించామన్నారు. అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నదన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా ఫండ్స్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఇండస్ట్రీ డే పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికలను నిస్పక్షపాతంగా నిర్వహించాలి

- శాంతి భద్రతల, మతపరమైన సమస్యల తలెత్తకుండా చర్యలు చేపట్టాలి
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ఎస్పీలతో రాష్ట్ర డిజిపి బి శివధర్ రెడ్డి సమీక్ష

**విశాలభారతి, ఆదిలాబాద్**




రాష్ట్రం లో మూడు విడుతలుగా జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్పీలతో గురువారం తెలంగాణ రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర డిజిపి మాట్లాడుతూ ప్రజలకు ప్రశాంతమైన వాతావరణం లో, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా చేపట్టవలసిన ఎన్నికల నియమాలని కచ్చితంగా అమలు చేయాలని,మహారాష్ట్ర సరిహద్దు తో ఉన్న నేపథ్యంలో అక్రమ రవాణా జరగకుండా చెక్పోస్ట్ ద్వారా అడ్డుకోవాలని తెలిపారు. మతపరమైన సమస్యలు, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల నందు ఎక్కువ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. ఎన్నికల విధులలో సాయుధ సిబ్బందిని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలలో సమస్యలను సృష్టించే వారిని బైండోవర్ చేస్తూ ఉండాలన్నారు, ప్రజలలో నమ్మకం పెంచేందుకు, ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ ప్రజలలో పోలీసులు పట్ల ధైర్యం నింపాలన్నారు. గ్రామాలను సందర్శిస్తూ ఎన్నికల పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఏలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఎన్నికల పూర్తయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీలు జరగకుండా పర్యవేక్షించాలి అన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాలను సందర్శిస్తూ సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. విడిసి ఆగడాలను అరికట్టాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ సమయంలో ఏలాంటి శాంతిభద్రతల సమస్యలు సమస్యలు తలెత్తకుండా రూట్ మొబైల్ లను ఏర్పాటు చేయాలన్నారు. చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి, మద్యం అక్రమ రవాణాలను అడ్డుకోవాలన్నారు.

# రూపాయి పాలిటిక్స్

- రూపాయి విలువ మహా పతనం కొనసాగుతోంది
- రూపాయి విలువ ఏకంగా రూ.90 దాటింది
- చరిత్రలోనే అత్యంత కనిష్ట స్థాయికి చేరింది
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర విమర్శలు
- ప్రపంచంలోనే మన కరెన్సీకి విలువ లేకుకండా పోయింది
- అందుకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని ఆరోపణ
- రూపాయి పతనం దేశ ఆర్థిక పరిస్థితిని వెల్లడిస్తుంది



**విశాలభారతి, నేషనల్ :**

రూపాయి విలువ మహా పతనం కొనసాగుతోంది. అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా రూ.90 దాటింది. కొంతకాలంగా వేగంగా పడిపోతున్న రూపాయి విలువ.. చరిత్రలోనే అత్యంత కనిష్టస్థాయికి చేరింది. మంగళవారం ఒక డాలర్‌కు రూ.89.9475 ఉండగా.. బుధవారం ట్రేడింగ్ ఒకానొక దశలో రూ.90.30కు పడిపోయింది. చివరకు రూ.90.15 వద్ద స్థిరపడింది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం కావటం, రూపాయి విలువను కాపాడేందుకు ఆర్బీఐ ఎలాంటి చర్యలు చేపట్టకపోవటం, విదేశీ సంస్థాగత పెట్టుబడులను మదుపరులు వెనక్కి తీసుకోవటం రూపాయి పతనానికి ప్రధాన కారణాలని నిపుణులు పేర్కొంటున్నారు. రూపాయి పతనం ప్రభావం దేశంలోని పేద, మధ్యతరగతి వర్గాలపై భారీగా ఉంటుందని చెబుతున్నారు. ఒకవైపు జీడీపీ రేటు స్థిరంగా పెరుగుతుందని గణాంకాలు వెలువడుతుండగా, రూపాయి విలువ ఆగకుండా పతనం అవుతుండటంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రూపాయి విలువ పతనంపై భయపడాల్సిన అవసరం ఏమీ లేదని, వచ్చే ఏడాది బలపడుతుందని కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఏడాది ఆసియా దేశాల కరెన్సీల్లో భారత రూపాయి పరిస్థితేఅత్యంత దారుణంగా ఉందని కొటక్ సెక్యూరిటీస్‌కు చెందిన అనంద్య బెనర్జీ తెలిపారు.

భారత కరెన్సీ రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో పడిపోవడంపై కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ప్రపంచంలోనే మన కరెన్సీకి విలువ లేకుకండా పోయిందని అన్నారు. అందుకు ప్రభుత్వ ఆర్థిక విధానాలే కారణమని ఆరోపించారు. గురువారం పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'మోదీ ప్రభుత్వ విధానాల వల్లే రూపాయి బలహీనమవుతోంది. ఆ విధానాలు సరైనవి అయితే, రూపాయి పడిపోయేది కాదు. ఇది మన ఆర్థిక పరిస్థితి బాగోలేదని చూపిస్తోంది. మనం ఏది కావాలంటే అది చెప్పుకోవచ్చు, ఎంతైనా పొగడవచ్చు. కానీ రూపాయి పతనం దేశ నిజమైన ఆర్థిక పరిస్థితిని వెల్లడిస్తుంది. ప్రపంచంలో మా కరెన్సీకి విలువ లేదని ఇది స్పష్టం చేస్తోంది. 2014కు ముందు రూపాయి విలువ ఎందుకు పడిపోయిందో సమాధానాలు చెప్పాలని మోదీ ప్రశ్నించారు. ఈ రోజు మేం కూడా ప్రధాని మోదీని అదే ప్రశ్నిస్తున్నాం. ఆయన దీనికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది' అని ఖర్గే అన్నారు.

కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ కూడా రూపాయి విలువ పడిపోవడంపై వ్యంగ్యంగా స్పందించారు. ప్రస్తుతం మన రూపాయి విలువ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వయసును దాటిపోయిందని అన్నారు. 2013లో రూపాయి విలువ పడిపోతుందని బీజేపీ నాయకుడు రవిశంకర్ చేసిన విమర్శలను చెప్పారు. రూపాయి విలువపై రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మన్మోహన్ సింగ్ వయస్సులను పోల్చుచూ రవీశంకర్ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. ఈ విషయంపై కాంగ్రెస్ ఎంపీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో రూపాయి పడిపోయినప్పుడు బీజేపీ చేసిన విమర్శలను గుర్తుచేశారు. 'అప్పుడు విమర్శించారు కదా ఇప్పుడు వారి సమాధానం ఏమిటి?' అని ప్రియాంక గట్టిగా ప్రశ్నించారు. దేశ ఆర్థిక పరిస్థితిపై కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుధవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి రికార్డ్ స్థాయిలో క్షీణించింది. రూ. 90కు మించింది. బుధవారం 19 పైసలు తగ్గి 90.15 వద్ద ముగిసింది. గురువారం కూడా డాలర్ పోలిస్తే మన కరెన్సీ విలువ ఏకంగా 28 పైసలు పడిపోయింది. 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. మరికొన్ని రోజులు పాటు రూపాయి విలువ క్షీణించే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. 90.70 నుంచి 90.91 మార్క్‌ను తాకనుందని అంటున్నారు. డాలర్ ప్రపంచవ్యాప్తంగా బలపడుతున్న దృష్ట్యా రూపాయి వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అమెరికా ఆర్థిక సంఖ్యలతో పాటు గ్లోబల్ బాండ్ యీల్డ్స్ పెరుగుదల కూడా డాలర్‌కు బలం చేకూర్చుతున్నాయి. భారత్‌అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాల వల్ల రూపాయి మారకం విలువ నానాటికీ క్షీణిస్తోంది.గత కొన్ని నెలలుగా భారత ఈక్విటీ, డెట్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటుండటంతో డాలర్లకు గిరాకీ పెరిగిందని చెబుతున్నారు. అందువల్లే రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోందని అన్నారు. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటమూ రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.

# ఆదిలాబాద్‌కు ఎయిర్‌బస్ తెస్తా









**( మొదటిపేజీ తరువాయి )**

నేను కాంగ్రెస్ పార్టీ అయి ఉండ వచ్చు.. ఏడాది లోపు ఎయిర్ పోర్టు పనులు ప్రారంభిస్తాం.. ఎర్ర బస్సు ఎరుగని ప్రాంతం లో ఎయిర్ బస్సు దింపు తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రేమ్ సాగర్ రావ్ సహకారంతో దళిత గిరిజన దండోరా నిర్వ హించామని, ఇంద్ర వెల్లి పోరాట స్ఫూర్తి అమరుల కుటుంబాలు ఆదుకున్నామన్నారు సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత నాదే అని ఆయన హామీ ఇచ్చారు.

అంతేకాకుండా..రాబోయే రెండు నెలల్లో ఇక్కడి కే వస్తా.. రోజు అంతా సమీక్ష చేస్తా. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తా. కేసీఆర్ ప్రాణహిత ను కాలగర్భం లో కలిపాడు. పేరు ఊరు మార్చాడు.. కాళేశ్వరం కడితే మూడేళ్ల లో కూలే శ్వరం అయింది. తరలిపోయి కరీంనగర్ జిల్లా లో కట్టారు. లక్ష కోట్లు గోదావరి పాలు అయ్యాయి. అక్రమం చేస్తే ప్రస్తుతం ఆ కుటుంబం పరిస్థితి ఏందో చూడండి. వాళ్ళ ఇంట్లో పైసల పంచాయితీ తప్పా మరోటి లేదు. ప్రాణహిత కు టెండర్లు పిలిచాము. తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాణ హిత ప్రాజెక్టు ను కట్టి తీరుతాం. ప్రారంభోత్సవానికి నేనే వస్తా. బీజేపీ నేతల సహకారం తీసుకుంటా. మూత పడిన సిమెంట్ పరిశ్రమలు మళ్ళీ ప్రారంభించేందుకు కృషి చేస్తా. ఆదిలాబాద్ ను వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతా. ఎడ్యుకేషన్ ,ఇరిగేషన్ కమ్యూనికేషన్ ,ఎక్కడ ఉంటుందో అక్కడ అభివృద్ధి జరుగుతుంది. ఆ లక్ష్యం తో పనిచేస్తాం అభివృద్ధి చేస్తా ము. ఖమ్మం కు వర్శిటీ ఇచ్చాము. ఆదిలాబాద్ కు వర్శిటీ ఇస్తాం. అంతా కలిసి ఓ నిర్ణయంకు రండి. ఇంద్రవెల్లిలో వర్సిటీ కడితే బాగుటుంది.. ఇంద్రవెల్లి లేదా కొమురం భీం పేరుతో వర్సిటీ పెడితే బాగుంటుంది. నిర్ణయం మీరు తీసుకోండి అనుమతి ఇస్తాం.. వర్శిటీ కి స్థలం ఎక్కడో మీరే నిర్ణ యించండి అని.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధులకు సీఎం సూచించారు. ఇదే కాకుండా.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌కు కావాలి.. ఎన్నికల కోసం అని తిరగకండి.. మంచిగా చదవండి.. ఉద్యోగాలు సాధించాలి అని నిరుద్యోగులకు సీఎం కీలక సూచన చేశారు.

# ఈ పంచాయతీలు మా వల్ల కాదు

- పంచాయతీ ఎన్నికలపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు
- అందులో జోక్యం చేసుకోలేమని తేల్చి చెప్పింది
- ఇప్పటికే రెండు విడతల నామినేషన్ల ప్రక్రియ పూర్తి
- రిజర్వేషన్లు సరిగ్గా లేవంటూ దాఖలైన పిటిషన్లపై విచారణ
- ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేమంది
- ఎన్నికలు ముగిశాక ప్రభుత్వంతో చర్చిస్తామని వెల్లడి
- అభ్యంతరాలుంటే చట్టపరంగా వెళ్లవచ్చని సూచించింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**


ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక అందులో జోక్యం చేసుకోవడానికి రాజ్యాంగ నిషేధం ఉందని, ఎన్నికల కు ముందు తరువాత మాత్రమే జోక్యం చేసుకోగల మని హైకోర్టు తేల్చి చెప్పింది. రాజ్యాంగం ప్రకారం ఎన్నికల ప్రక్రియలో కోర్టుల జోక్యంపై స్పష్టమైన నిషేధం ఉందని తెలిపింది. రాష్ట్ర విభజన తరువాత పంచాయతీల విభజన జరిగిందని, ఈ సందర్భంగా జనాభా లెక్కలు కూడా మారినా ప్రభుత్వం మాత్రం నీటన్నింటినీ పరిశీలించకుండా 2011 జనాభా గణాంకాలనే పరిగణనలోకి తీసుకుందని పేర్కొంది. నవంబరు 25 ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిందని, ఇప్పటికే మొదటి రెండు విడతలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కూడా జరిగిందని, అందువల్ల ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేమంది అయితే సంబంధిత వర్గాలకు చెందిన జనాభా లేకపోయినా రిజర్వేషన్లు కేటాయింపు జరిగిన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే అంశాన్ని ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ ముగిశాక ప్రభుత్వంతో చర్చించి ఎన్నికలు జరపనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన హామీని నమోదు చేస్తూ పిటిషన్లపై విచారణను మూసివేసింది.

వార్డుమెంబర్లు, సర్పంచుల రిజర్వేషన్లు సరిగ్గా లేవంటూ వేర్వేరుగా దాఖలైన ఆరు పిటిషన్లపై ధర్మాసనం విచారణ చేపట్టింది. 2011లో ఉన్న పంచాయతీల విభజన జరిగాక కొన్ని పంచాయతీల్లో ఎస్టీలున్నారని. మరికొన్నింటిలో ఉండటంలేదని పిటీషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. అయినా 2011 జనాభా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించారన్నారు. రిజర్వేషన్లపై అభ్యంతరాలు చెప్పడానికి వీల్లేకుండా రాత్రికి రాత్రే నోటిపికేషన్ జారీ అయిందన్నారు. తామేమీ ఎన్నికలు నిలపాలని కోరడంలేదని, ప్రభుత్వం కనీస అధ్యయనం చేయకుండా రిజర్వేషన్లు ఖరారు చేశారని న్యాయవాదులు వాదించారు. ఒక గ్రామంలో ఒకే ఒక్క ఎస్టీ ఉంటే అతన్ని చేర్చుకోవడానికి పార్టీలు పోటీలు పడుతున్నాయన్నారు. ఎన్నికల పిటిషన్ వేయడానికి ప్రత్యర్థి కూడా లేరన్నారు. 2011 జనాభా గణాంకాలు తప్ప మరే ఇతరత్రా సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోలేమని, అందువల్ల 2011 జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ ఎస్టీలకు రిజర్వేషన్లు కేటాయింపు జరిగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం తరపు సీనియర్ న్యాయవాది కోర్టుకు తెలిపారు.

ప్రభుత్వం ఒకసారి రిజర్వేషన్లు ఖరారు చేసి తమకు జాబితా ఇచ్చిన తరువాత వాటిని అమలు చేయడం వరకే తమ బాధ్యత అని తెలిపారు. ఎస్టీలు లేని పంచాయతీ రిజర్వేషన్ల పరిధిలో ఉన్నట్లయితే ప్రస్తుతం ఎన్నికలు జరగవని, అయితే ప్రస్తుత ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తరువాత ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. వాదనలను విన్న ధర్మాసనం అధ్యయనం లేకుండా రిజర్వేషన్లు కల్పించిన మాట వాస్తవమే అయినప్పటికీ ఎన్నికల ప్రక్రియలో కోర్టు జోక్యానికి రాజ్యాంగ నిషేధం ఉందని తెలిపింది. సంబంధిత రిజర్వేషన్‌కు సంబంధించి వ్యక్తులు లేని విషయంలో ఎన్నికల సంఘం హామీ ఇస్తోందని, ఎన్నికల అయ్యాక పిటిషనర్ల అభ్యంతరాలను సంబంధిత యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపింది. ఎన్నికల అనంతరం తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పిటిషనర్లకు అవకాశం ఉంటుందని, ప్రస్తుతం మాత్రం ఈ దశలో జోక్యం చేసుకోలేమంటూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల తగ్గింపు వ్యవహారంలో కలెక్టర్లందరినీ తొలగించాలా అంటూ బీసీ సంక్షేమ సంఘాన్ని హైకోర్టు ప్రశ్నించింది. రిజర్వేషన్ల అంశంలో వారిపై కోవారెంట్ పిటిషన్ ఎలా విచారణార్హమని, ఇందులో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది. ఏవైనా అభ్యంతరాలుంటే చట్టపరంగా వెళ్లవచ్చని బీసీ సంక్షేమ సంఘానికి అనుమతించింది. బీసీ రిజర్వేషన్లను తగ్గించడంపై ప్రభుత్వ కార్యదర్శులతోపాటు 31 మంది కలెక్టర్లపై తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కోవారెంటో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ పి శ్యాంకోశీ, జస్టిస్ సుద్దాల చలపతిరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రిజర్వేషన్లు ఏ ప్రాతిపదిక 24 నుంచి 17 శాతానికి తగ్గించారన్నది వెల్లడించలేదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. రిజర్వేషన్లను తగ్గిస్తున్నట్లయితే ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించి నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా కలెక్టర్లు రిజర్వేషన్లను ఖరారు చేశారన్నారు. రిజర్వేషన్ పాలసీ శాసనవ్యవస్థదని, కలెక్టర్లు తీసుకోరాదన్నారు. కోవారెంటో పిటిషన్ వేయడానికి వారేమీ ఎన్నికైన వారుకాదని కలెక్టర్లు అని అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుకు తెలిపారు. కలెక్టర్లపై కోవారెంటో పిటిషన్ విచారణార్హం కాదన్నారు. వాదనలను విన్న ధర్మాసనం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.

# బంధం బలోపేతం

- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీ చేరుకున్నారు
- స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికారు
- స్వాగతం పలికేందుకు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టారు పీఎం మోదీ
- కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ తిలకించారు
- ప్రధాని మోదీ- రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒకేకారులో వెళ్లారు
- ఈరోజు భారత్- రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశం
- ఉక్రెయిన్ యుద్ధం ముగింపు అంశం ప్రస్తావించే అవకాశం ఉంది



**విశాలభారతి, నేషనల్ :**

భారత్ చిరకాల మిత్రదేశం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నాలుగేళ్ల తర్వాత రెండురోజుల పర్యటనలో భాగంగా ఢిల్లీ చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6గంటలా 40 నిమిషాలకు ఆయన విమానం ఢిల్లీలోని పాలం విమానాశ్రయం లో ల్యాండ్ అయింది. ప్రధాని మోదీ అంతకుముందే పాలం విమానాశ్రయానికి చేరుకున్నారు. పుతిన్‌కు స్వాగతం పలికేందుకు ప్రొటోకాల్‌ను పక్కనపెట్టారు. స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలికారు. విమానాశ్రయంలోనే ఏర్పాటు చేసిన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలను పుతిన్ తిలకించారు. అనంతరం ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ ఒకేకారులో వెళ్లారు. గురువారం అధికారిక కార్యక్రమాలేవీ లేనప్పటికీ ప్రధాని మోదీ ఆయన గౌరవార్థం ఈ రాత్రి ఏర్పాటు చేసిన విందులో పుతిన్ పాల్గొంటారు. ఆయన పర్యటన సందర్భంగా పుతిన్‌కు ఇష్టమైన వంటకాలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పుతిన్ తేలికగా జీర్ణమయ్యే, సంప్రదాయ వంటకాలను ఇష్టపడతారని జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో రష్యాలో పాపులర్ అయిన కాటన్ చీజ్, తేనె కలిపి చేసే టోవోరాగ్ వంటకాన్ని తింటారు. కౌజుపిట్ట గుడ్లు, తాజా పళ్లతో చేసే జ్యూస్ తీసుకుంటారు. ప్రొటీన్ కోసం చేపలను ఎక్కువగా తింటారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. స్టర్జియన్ చేప, గొర్రె పిల్ల మాంసం అంటే పుతిన్‌కు చాలా ఇష్టమట. చక్కెరతో చేసే పదార్థాలతోపాటు డెజర్ట్‌లపై ఆసక్తి చూపించరని తెలుస్తోంది. వాటికి బదులు టమోటాలు, దోసకాయలు వంటి కూరగాయలతో చేసే సలాడ్‌లను తీసుకుంటారు. చాలా అరుదుగా ఐస్‌క్రీమ్, పేస్ట్రీలు వంటివి తింటారట. అధికారిక డిన్నర్లలో ఎక్కువగా చేపలతో చేసే సూప్, మాంసాహారానికి ప్రాధాన్యమిస్తారని మీడియా కథనాలు పేర్కొన్నాయి.

శుక్రవారం భారత్ రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ప్రతీకార సుంకాల కారణంగా అమెరికాతో భారత్ సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో రష్యాతో ద్వైపాక్షిక వ్యూహాత్మక, ఆర్థిక భాగస్వామ్యం బలోపేతం కానుంది. పుతిన్ భారత పర్యటనను అమెరికా ఐరోపా దేశాలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

రష్యా అధ్యక్షుడు పుతిన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో అధికారిక స్వాగతం అందుకోనున్నారు. పదకొండున్నరకు రాజ్‌ఘాట్‌ను సందర్శించి గాంధీ సమాధి వద్ద నివాళులు అర్పిస్తారు. అనంతరం హైదరాబాద్ హౌస్‌లో భారత్ రష్యా శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ, వాణిజ్య ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో జలాంతర్గామి లీజుకు సంబంధించిన ఒప్పందం కూడా ఖరారు కావచ్చని తెలుస్తోంది. ఆ ఒప్పందం విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లు అని సమాచారం. ఈ జలాంతర్గామి కోసం పదేళ్లుగా జరిగిన చర్చలు ఎట్టకేలకు పుతిన్ భారత పర్యటన సందర్భంగా కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపు అంశం కూడా ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. అనంతరం ప్రధాని మోదీ రష్యా అధ్యక్షుడు పుతిన్ సంయుక్త మీడియా సమావేశంలో పాల్గొంటారు. రష్యా ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేసే రష్యా టుడే న్యూస్ ఛానెల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. ఆ తర్వాత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఇచ్చే అధికారిక విందులో ఆయన పాల్గొంటారు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు రష్యాకు తిరిగి పయనమవుతారు. పుతిన్ భారత పర్యటన వేళ దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. స్వాట్ బృందాలు, స్నైపర్లను పెద్దఎత్తున మోహరించారు.

పుతిన్ భారత పర్యటనకు పూర్తి భద్రత కల్పించేందుకు.. రష్యాకు చెందిన నాలుగు డజన్లకు పైగా భద్రతా సిబ్బంది ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. ఢిల్లీ పోలీసులు, ఎన్ఎస్‌జీ అధికారులతో కలిసి.. రష్యా సెక్యూరిటీ.. పుతిన్ ప్రయాణించే మార్గాలను పరిశుభ్రం చేస్తున్నారు. ఈ భద్రతా వలయంలో స్నైపర్‌లు, డ్రోన్‌లు, జామర్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పర్యవేక్షణ, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలు వంటి అత్యాధునిక టెక్నాలజీ పరికరాలను ఉపయోగించనున్నారు. పుతిన్ భారత్‌లో అడుగుపెట్టిన అప్పటి నుంచి ఈ ఐదు అంచెల భద్రతా వలయం యాక్టివ్ అయింది. బయటి వలయాల్లో ఢిల్లీ పోలీసులు.. ఎన్ఎస్‌జీ ఉండగా.. లోపలి వలయాలను రష్యా ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ నిర్వహిస్తుంది. ప్రధాని మోదీతో ఉన్నప్పుడు.. ప్రధానమంత్రి రక్షణ బాధ్యతలు చూసే స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ) కమాండోలు కూడా లోపలి వలయంలో చేరతారు. పుతిన్ కోసం రష్యా నుంచి ప్రత్యేకంగా 'ఆరస్ సెనట్' అనే అత్యంత పటిష్టమైన సాయుధ లగ్జరీ లిమోసిన్ కారును కూడా ఢిల్లీకి తీసుకువచ్చారు. రష్యా అధ్యక్షుడు ఉపయోగించే ఈ సాయుధ లగ్జరీ లిమోసిన్‌ను చక్రాల కోట అని కూడా పిలుస్తారు. దీన్ని మాస్కో నుంచి ప్రత్యేకంగా ఢిల్లీకి తీసుకువచ్చారు. ఈ ఏడాది ప్రారంభంలో చైనాలో జరిగిన ఎస్‌సీఓ సమ్మిట్ సమయంలో కూడా పుతిన్ ఇదే ఆరస్ సెనట్‌లో ప్రధాని మోదీతో కలిసి ప్రయాణించడం విశేషం.

# రేవంత్ అవినీతి అనకొండ

- కార్మికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు కేటీఆర్
- రూ.5 లక్షల కోట్ల భారీ భూ కుంభకోణానికి తెరలేపారు
- ప్రభుత్వ భూములు ప్రవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారు
- ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కట్టలేదు
- హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం
- లక్షల కోట్ల ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం ఆగదు
- మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తామని అన్నారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :**

కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీ పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల భారీ భూమి కుంభకోణానికి పాల్పడుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. మేడ్చల్ జిల్లా షాపూర్ నగర్ జీడిమెట్ల పారిశ్రామిక వాడలో అక్కడి పరిశ్రమల కార్మికులతో కలిసి ఆందోళనలో పాల్గొన్నారు. ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలు పరిశ్రమల కోసం ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని కేటీఆర్ ఆరోపించారు. పరిశ్రమలు వద్దు అంటూ అపార్ట్మెంట్లు విల్లలు కమర్షియల్ కాంప్లెక్స్ లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నదని.. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేటు వ్యక్తుల భూములు కావు ప్రైవేట్ వ్యక్తులకు ప్రజలు ప్రభుత్వం ఇచ్చిన భూములన్నారు. అందులో కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. లక్షన్నర రూపాయలకు గజం ధర మార్కెట్లో పలుకుతుంటే కేవలం 4000 రూపాయలకు ప్రవేట్ వ్యక్తులకు అప్పచెప్తున్నదని.. హైదరాబాద్ నగరంలో ఇండ్లకు పాఠశాలలకు ఆసుపత్రులకు చివరికి స్మశానాలకు స్థలం లేదు కానీ ప్రైవేట్ వ్యక్తులకు 9300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటున్నదని మండిపడ్డారు. ఈ తొమ్మిది వేల 300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని అక్కడ కాంగ్రెస్ చెప్తున్నా ఇందిరమ్మ ఇండ్లు యంగ్ ఇండియా స్కూల్స్ ఆసుపత్రులు కట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదని గుర్తు చేశారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలి వెళ్తే హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకి వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామని.. కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిర్ధారణ జరగాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితో మా పార్టీ వదిలిపెట్టదని.. కాంగ్రెస్ పార్టీ హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నగరంలో కాలనీలలో ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తాము.. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ సమావేశాలు నిర్వహిస్తాము ..ప్రజా సంఘాలు ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామని ప్రకటించారు. ఈ పాలసీని వెనక్కి తీసుకొని లక్షల కోట్ల ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.


మా ప్రభుత్వం రాగానే ఈ పాలసీది రద్దు చేస్తాము ..అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని తీసుకువస్తాము ...ఈరోజు రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయి అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని దోపిడీని చూసి తట్టుకోలేక తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారని.. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా సమాచారం లీక్ అయింది అంటూ బాధపడుతున్నదన్నారు. చిత్త శుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టు పక్కల భూములకు సంబంధించి తీసుకురావాలనుకున్న ముఖ్యమైన విధానం లీక్ కావడంపై రాష్ట్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉంది. ఈ ముఖ్యమైన సమాచారం ప్రభుత్వ జీవో విడుదల కాకముందే ప్రతిపక్ష నాయకుల చేతికి ఎలా వెళ్లిందనే దానిపై అధికారులు ఇప్పుడు లోతుగా దృష్టి పెట్టారు. అసలు ఈ లీకేజీ ఎలా జరిగిందో తెలుసుకోవడానికి విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న పారిశ్రామిక భూములకు సంబంధించి 'హిల్ట్ పాలసీ' తీసుకురావాలని ప్రభుత్వం ప్లాన్ చేసింది. ఈ పాలసీ తయారుచేసే సమయంలోనే, అంటే నవంబర్ 20వ తేదీ నాడే, దీనికి సంబంధించిన కొన్ని స్లైడ్స్ బయటకు వచ్చాయని పెద్ద అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సమాచారం లీకైన వెంటనే, నవంబర్ 21న ప్రతిపక్ష నాయకుడైన కేటీఆర్ ఈ పాలసీపై మీడియా ముందు మాట్లాడారు. ఆ తర్వాత రోజు, అంటే నవంబర్ 22న, ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేసింది. జీవో రాకముందే ఈ రహస్య సమాచారం ప్రతిపక్షాలకు ఎలా అందిందనే దానిపై ప్రభుత్వం చాలా కోపంగా ఉంది.

ఈ కీలకమైన విధాన నిర్ణయం తయారీ సమయంలో పరిశ్రమల శాఖలో ఎవరు ఈ సమాచారాన్ని బయటకు ఇచ్చారు అనే దానిపై ఇప్పటికే శాఖాపరమైన విచారణ మొదలైంది. అయితే, దీనిని ప్రభుత్వం చాలా పెద్ద సమస్యగా చూస్తోంది. అందుకే, ముందుగా సమాచారాన్ని లీక్ చేసిన వారిని కనుగొనడానికి, దీని వెనుక అసలు కారణాలు ఏమై ఉండొచ్చు అని తెలుసుకోవడానికి ఇప్పుడు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణ పూర్తి అయితేనే, ఈ లీకేజీకి సంబంధించి పూర్తి వివరాలు ప్రజలకు తెలిసే అవకాశం ఉంది. ప్రభుత్వంలోని అంతర్గత రహస్యాలు బయటకు రావడంపై తీసుకున్న ఈ చర్య రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రిటర్నింగ్ అధికారి నిర్లక్ష్యం

- న్యాయం చేయాలని సబ్ కలెక్టర్ కి ఫిర్యాదు



**నిజామాబాద్, విశాలభారతి:** గ్రామ సర్పంచ్ గా నామినేషన్ వేసిన సందర్భంలో సరైన కారణం లేకుండా నామినేషన్ పత్రాన్ని రిటర్నింగ్ అధికారి తాత్కాలికంగా నిలిపివేశారని జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు దినేష్ కులచారి తెలిపారు. గురువారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాక్సన్ పల్లి మండలం మునిపల్లి గ్రామంలో కాంగ్రెస్ బిజెపి పార్టీల ఇద్దరు అభ్యర్థులు సర్పంచి పోటీలకు నామినేషన్ వేశారు. బిజెపి పార్టీకి చెందినచింతల గోపి సర్పంచ్ నామినేషన్ వేశారు గతంలో ఇతను ఆర్టీసీలో వాళ్ల తండ్రి యొక్క ఉద్యోగాన్ని చేస్తూ వివిధ కారణాలవల్ల ఆర్టిసి జాబ్ కు రిజైన్ చేశారు. సర్పంచ్ డిక్లరేషన్ కాగానే బిజెపి పార్టీ నుండి సర్పంచి కొరకు నామినేషన్ వేశారు.ఏ అభ్యంతరం మీద నామినేషన్ తిరస్కరించారనీ రిటర్నింగ్ అధికారిని నిలదీయగా ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వలేదని. అధికార కాంగ్రెస్ పార్టీ బిజెపి నాయకులు గెలిచే సత్తా ఉన్న నాయకులను కాంగ్రెస్ నాయకులు అధికారులను భయభ్రాంతులకు గురి చేసి బిజెపి నాయకులను గెలవకుండా అడ్డుపడుతున్నారని. ఇలాంటి సంఘటనలు పు పునవృత్తం కాకుండా చూడాలని ప్రజాస్వామ్య బద్దంగా బద్ధంగా జరగాల్సిన సర్పంచ్ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీకి పోటీదారు ఉండకూడదనే ఉద్దేశంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు.ఇందుకు రాష్ట్ర సలహాదారుడు సుదర్శన్ రెడ్డి,మంత్రి సీతక్క ఎమ్మెల్యే భూపతి రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల అధికారి స్పందించి పంచాయతీరాజ్ చట్టం ప్రకారం మునిపల్లి అభ్యర్థిని అర్హుడిగా ప్రకటించాలన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్మూరు పట్టణ అధ్యక్షులు మందుల బాలు. కంచెట్టి గంగాధర్. జీవీ నరసింహారెడ్డి. వేణు. బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చందూలాల్ ను గెలిపించాలని ప్రచారం



**అశ్వాపురం, విశాలభారతి :** అశ్వాపురం మేజర్ గ్రామపంచాయతీకి సర్పంచ్ అభ్యర్థిగా తలపడుతున్న భూక్యా చందూలాల్ విజయాన్ని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని కాలువ బజారులో బిఆర్ఎస్ నాయకులు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుల, సర్పంచుల గుర్తులను చూయిస్తూ వారికి ఓట్లు వేసి మెజారిటీతో గెలిపించాలని కోరుకున్నారు. సర్పంచ్ కి కేటాయించిన కత్తెర గుర్తు అలాగే 9వ వార్డు అభ్యర్థి ఓరుగంటి రజిత గ్యాస్ పోయి గుర్తు పై ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కందుల కృష్ణా అర్జునరావు, ఈదర సత్యనారాయణ, కంచుగట్ల వీరభద్రం, గద్దల రామకృష్ణ, చుంచు రామ్మూర్తి సతీష్, చిలక వెంకటరామయ్య, పవన్, నరేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఘంటసాల జయంతి వేడుకలు



**పాల్వంచ,విశాలభారతి:** ప్రఖ్యాత సినీ గాయకుడు శ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలను స్థానిక మున్సిపల్ పరిధిలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో పాల్వంచ కళాపరిషత్ ఆధ్వర్యంలో వేముల కొండలరావు అధ్యక్షతన గురువారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపరిషత్ అధ్యక్షులు మంతపుడి రాజు గౌడ్ మాట్లాడుతూ తెలుగు సంగీత ప్రపంచంలో ఘంటసాలకు ఉన్న అపూర్వ స్థానం, ఆయన పాటల లోని విలువలు, సాహిత్య భావన తరతరాలకు ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ జి భాస్కరరావు మాట్లాడుతూ ఘంటసాల శ్రావ్యమైన స్వరాలు, గాత్ర విశిష్టత, కొత్త తరానికి పరిచయం చేయడం సమాజం బాధ్యత అని విద్యార్థుల్లో సంగీతాభిజ్ఞత పెంపొందించుటకు విద్యాసంస్థలు ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి లింగమూర్తి, టియుఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి మంజూర్, నేతాజీ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ కే జే కే అహ్మద్, పాఠశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్ రెడ్డి, కళాకారులు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులు వేగవంతం

- కాలవల పూడికను తీస్తున్న కార్మికులు
- కాలువల పూడిక పనులను చేపిస్తున్న సూపర్వైజర్



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం పట్టణంలోని శివారు ప్రాంతమైన రాజుపేట కాలనీలో గత కొన్ని రోజులుగా మురికి కాలువలను పూడిక తీపిస్తూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తను శుభ్రం చేస్తూ రాజుపేట కాలనీ స్వచ్ఛ భద్రాద్రిగా నిరంతరం కష్టిస్తున్న సూపర్వైజర్ కార్మికుల సమన్వయ పని విధానం స్థానిక ప్రజలు వర్షం వ్యక్తం చేస్తున్నారు ఈ పనుల పంపకాలను ఈవో శ్రీనివాసరావు భద్రాచలం ప్రాంతాన్ని స్వచ్ఛ భద్రాచలం గా మార్చే ప్రయత్నంలో భాగంగా కార్మికులకు సూపర్వైజర్లను సమన్వయం చేస్తూ పని విభజన చేసి అతివేగవంతంగా పారిశుద్ధ్య పనులను భద్రాచలం పట్టణంలో చేపట్టడం హర్షనీయమైన విషయంగా స్థానికులు చెప్తున్నారు. ఏరోజుకారోజు చెత్తను తీసుకువెళ్లడం రోడ్లన్నీ ఎటువంటి చెత్త లేకుండా చేయటం అలాగే ఎక్కడ నీళ్లు నిలువ లేకుండా మురికి నీరు ని పల్లపు ప్రాంతాలకు తరలించే విధంగా చర్యలు చేపట్టడం పట్ల ఈవోని పలువురు అభినందిస్తున్నారు.


## బాల్యస్నేహం అక్షయబంధం

- 2000–2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సేవా హస్తం



**పాల్వంచ, విశాలభారతి:** పాల్వంచలోని బొల్లోరిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో 2000-2001 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ బాల్య స్నేహబంధం విలువను నిలబెట్టుకుంటూ, మానవతా దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. వీరి తోటి మిత్రుడు కొమ్మోజి అకాల మరణం పట్ల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. అతని దశదిన కార్యక్రమం సందర్భంగా మిత్రులందరూ కలిసి 28 వేల రూపాయలను సేకరించి, బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించారు.ఇతరుల కష్ట సుఖాల్లో పూర్వ విద్యార్థుల సంఘంగా అండగా నిలుస్తున్న ఈ బ్యాచ్ గతంలో కూడా మిత్రుడు కాల్వ రాజ శేఖర్ అకాల మరణం సమయంలో సుమారు 25 వేల రూపాయలను వారి కుటుంబానికి అందజేసింది. అవసర సమయంలో మానవత్వం ప్రదర్శించడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని, మిత్రులలో ఎవరికైనా ఆరోగ్య సమస్యలు లేదా ఆర్థిక ఇబ్బందులు వచ్చినప్పుడు వెంటనే సహాయంగా నిలవాలని 2000-2001 బ్యాచ్ విద్యార్థులు నిర్ణయించుకున్నారు. స్నేహం ఒక మాట మాత్రమే కాదు జీవితకాలం నడిచే బంధం అనే సందేశాన్ని సమాజానికి తెలియజేసే విధంగా ఈ సేవా కార్యక్రమం చోటుచేసుకోవడం విశేషం. చిన్ననాటి స్నేహాన్ని కేవలం జ్ఞాపకాల్లో కాకుండా, ఆచరణలో చూపిస్తూ ముందుకు సాగుతున్న ఈ పూర్వ విద్యార్థుల సేవా భావం ప్రశంసనీయమని సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి.

## ఆలూరు కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్



**నిజామాబాద్, విశాలభారతి:** ఆలూరు మండల కేంద్రం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముక్కెర విజయ్ సర్పంచ్ నామినేషన్ గురువారం వేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆలూరు సర్పంచ్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా సైనికుల పనిచేసి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు గడప గడపను ప్రచారం నిర్వహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆలూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో సైబర్ మోసగాళ్ల హల్ చల్

- నిరుపేద నుండి 14వేలు గుంజిన వైనం
- మరికొన్ని డబ్బులు కొట్టాలని ఫోన్ల ద్వారా వేధింపులు
- ఇండ్ల వద్దకే వచ్చి కొన్ని వస్తువులు అంటగట్టిన మోసగాడు
- లబోదిబోమంటున్న బాధితులు



**భద్రాద్రి, విశాలభారతి :** సైబర్ మోసగాళ్లు ఏజెన్సీలోని అమాయకులను మోసం చేసేందుకు పూనుకున్నారు. గ్రామాల్లోకే ద్విచక్ర వాహనాలపై వచ్చి మీకు కొన్ని వస్తువులు ఇస్తాము ఆ వస్తువులు కొనుగోలు చేస్తే అందులో కూపన్లు వస్తాయని ఆ కూపన్లలో బంపర్ డ్రా తగిలితే ఫ్రీగా మీకు తగిలిన వస్తువు చేరవేస్తామని నమ్మ పలుకుతూ చాకచక్యంగా అమాయకుల దగ్గర నుంచి వేలాది రూపాయలు గుంజుకొని వారి దగ్గర ఫోన్ నెంబర్లు కూడా తీసుకొని డ్రాలో తలిగిన వస్తువులను మీకు ఎటువంటి రుసుము లేకుండా మీకు పంపిస్తామంటూ చెప్పి మరలా వారికి ఫోన్ చేసి మీకు డ్రాలో పెద్ద వస్తువులు తగిలాయి వాటిని మీ ఇంటికి చేర్చాలంటే రవాణా చార్జీలు అదనంగా చెల్లిస్తేనే మీ ఇంటికి పంపిస్తామంటూ వారికి కొన్ని వస్తువుల ఫోటోలను వాట్సాప్ లో పెట్టి ఈజీగా అమాయకులను వారి ట్రాప్ లోకి దించుతున్నారు. ఈ మోసగాళ్ల చేతిలో మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన గొందిగూడెం గ్రామానికి చెందిన కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే నిరుపేద కుటుంబం బలయింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గొంది గూడెం గ్రామానికి చెందిన బత్తుల శ్రీను భార్య అయిన పద్మ ఇంటికి గత నవంబర్ నెల 28వ తేదీ ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై వెళ్ళాడు. గ్రైండర్, మిక్సీ, టేబుల్ ఫ్యాన్లు ఉన్నాయని వాటిని కొనుగోలు చేస్తే అందులో కూపన్లు వస్తాయని ఆ కూపన్లలో బంపర్ ప్రైజ్ ఏది ఉంటే అది మీకు ఫ్రీగా ఇస్తామని నమ్మబలికాడు. నాది భద్రాచలమేనని తన పేరు మల్లెల శ్రీనివాస్ రావని ఓ ఆధార్ కార్డు కూడా వారికి వాట్సాప్ లో పెట్టాడు. తొలుత ఈ వస్తువులను రూ. 7వేలతో కొనుగోలు చేసుకుంటే అందులో వచ్చిన కోపంలో ఉన్న బంపర్ ప్రైజ్ ను ఉచితంగా అందజేస్తామని సదరు మహిళలను నమ్మించాడు. మోసగాడి మాటలు నమ్మిన ఆ మహిళ రూ. 7వేలు చెల్లించి ఆ మూడు వస్తువులను తీసుకుంది. మేము భద్రాచలం వెళ్ళిన తర్వాత మీకు డ్రాలో తగిలిన వస్తువులు పంపిస్తామని చెప్పి అతను అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.గత నెల నవంబర్ 28 వ తేదీన మరల ఆ మోసగాడు బత్తుల పద్మకు ఫోన్ చేసి మీకు బంపర్ ప్రైజ్ గా ఓ మంచం తో పాటు పరుపు తగిలిందని రవాణా ఖర్చులకోసం రూ. 3 వేల 5 వందలు తాము పంపే స్కానర్ కు కొడితే మీ ఇంటికి మంచాన్ని చేరవేస్తామని తెలిపాడు. అతడు మాటలు నమ్మిన సదర మహిళా స్కానర్ కు 3500 కొట్టింది. మరికొంత సమయం తర్వాత ఓ మహిళ ఫోన్ చేసి మీరు పంపిన డబ్బులు సరిపోవడంలేదని మరో 3500 కొడితే వస్తువు పంపిస్తామని, లేదంటే మీరు పంపిన డబ్బులు తిరిగిరాని చెప్పడంతో మరలా మహిళా అదే స్కానర్ కు డబ్బులు కొట్టింది. అప్పటికే ఆమె రూ. 14వేలు కొట్టింది. అయినా వాళ్ళు మంచం పంపకుండానే ఈ నెల మూడో తేదీన మరోమారు ఫోన్ చేసి 1500 కొట్టండి లేదంటే మీ డబ్బులు అన్ని పోతాయని బెదిరించడం ప్రారంభించారు. దీంతో సదరు బాధితులు ఈ విషయాన్ని కొందరికి చెప్పడంతో వాళ్లు సైబర్ మోసగాళ్ల చేతులో మీరు బలయ్యారని తెలపడంతో బాధితులు లబోదిబోమన్నారు. అయినప్పటికీ సదరు సైబర్ నెరగాళ్లు పదే పదే వారికి ఫోన్లు చేసి డబ్బులు కొట్టండి అంటూ ఫోన్ ద్వారా వేధిస్తున్నారని బాధితులు వాపోయారు. తమకు న్యాయం చేయాలని మోసపోయిన బాధిత కుటుంబం వేడుకుంటున్నారు.

## పాలకుర్తి పంచాయితీ ఎన్నికల వేడి








**దేవరుప్పుల, విశాలభారతి:** స్థానిక ఎన్నికలు సమీపించడంతో రాజకీయ చర్చలు వేడెక్కుతున్నాయి. కాంగ్రెస్ బిఆర్ఎస్ స్వతంత్రులు దిగి పోటి మరింత రసవత్తరంగా మారింది. అసంతృప్తుల కారణంగా పార్టీల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. 4000 మంది జనాభా ఉన్న దేవరుప్పుల లో త్రిముఖ పోటీ హై ఎక్సైన్స్ ఎన్నికలుగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. స్వతంత్ర అభ్యర్థి పెద్ది కృష్ణమూర్తి గౌడ్ మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిఎసిఎస్ డైరెక్టర్ కాంగ్రెస్ ని విడిచి స్వతంత్రంగా బరిలో ప్రజల్లోనే ఉంటాను చేసిన సేవలు నన్ను గెలిపిస్తాయి అని విశ్వాసం. బిఆర్ఎస్ అభ్యర్థి ఏల సుందర్ గత ప్రభుత్వం కాలంలో బిఆర్ఎస్ లో చేరిన నేత రైతులకు, ప్రజలకు కోతుల ఇబ్బందుల భారీ నుండి పలు కార్యక్రమాలు చేసిన ధైర్యం నాన్న 40ఏళ్లుగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఇది మా కుటుంబ విశ్వాసం అని వాక్య. కాంగ్రెస్ అభ్యర్థి జక్కుల గంగరాజు బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లో చేరిన గంగరాజు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి భారీ మెజార్టీతో గెలుపులో భాగస్వామ్యం ఈసారి సర్పంచ్ అభ్యర్థిగా నిలిపింది. ఎన్నికల ఉత్కంఠ దేవరుప్పుల మండలంలో త్రిముఖ పోటీతో ఎన్నికలు ఉద్రిక్తంగా మారే అవకాశం అభ్యర్థుల సేవలు వర్గ బలం స్థానిక ప్రభావం కీలకం కానున్నాయి.

## అయ్యప్ప శనిధానంకి విరాళం



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని సురంగల్ లో అయ్యప్ప సన్నిదానం అభివృద్ధిలో భాగస్వాములు కావడం కోసం దాతలు స్వచ్ఛంధంగా ముందుకొచ్చి విరాళాలు అందజేస్తున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటి పరిధిలోని సురంగల్ గ్రామంలో గల అయ్యప్ప భక్తుల సన్నిదానం అభివృద్ధికి ఒకరిని చూసి ఒకరు స్ఫూర్తిదాయకంగా ముందుకొస్తున్నారు.గ్రామానికి చెందిన గాండ్ల విక్రం సన్నిధానం అభివృద్ధి కోసం రూ.51 వేలు విరాళం ఇచ్చాడు. అయ్యప్ప భక్తులు విక్రంను అభినందించారు. గాండ్ల సంతోష్ కుమార్ గురుస్వామి మరో రూ.30 వేలు ఇవ్వడం జరిగింది. ఇద్దరు అన్నదమ్ములు కలిసి సన్నిధానంకు రూ.81 వేలు విరాళం ఇచ్చారు.

## తాట్యీతండా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా లునావత్ రేణుక భార్గవ్ నామినేషన్



**కురవి, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తాట్యీతండా గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున లునావత్ రేణుక భార్గవ్ గురువారం ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు భారీగా తరలివచ్చి ఆటపాటలతో జరిపిన ఈ నామినేషన్ కార్యక్రమం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించిన అనంతరం రేణుక భార్గవ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజల ఆశీర్వాదం, సహకారం నాలో నమ్మకాన్ని పెంచింది. మీ ఒక్క ఓటుతో నన్ను గెలిపిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి, గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాను” అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు సభ్యులు నాగేష్, లక్ష్మి, వీరన్న, సుజాత, భారతి, దేవ్ సింగ్, మమత, సత్తిలతో పాటు పెద్ద సంఖ్యలో తాట్యీతండా గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే తాట్యీతండా కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు నాగేష్, పార్టీ సీనియర్ నాయకులు హేమ నాయక్, లక్ష్మ, సీతారాం, కిషన్, సక్రం, దేవేందర్, వీరన్న, గోవింద్ భావ్ సింగ్, వెంకన్న, నాగరాజు తదితరులు హాజరై రేణుక భార్గవ్‌ను కలసి అభినందించారు.

## భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరికలు




**నిజామాబాద్, విశాలభారతి:** పివిఆర్ భవన్ కార్యాలయంలో మాక్లూర్ మండలం లోని ధర్మోరా గ్రామానికి చెందిన బీర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా వినయ్ కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో వాగ్దానాలను నెరవేర్చింది అలాగే ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు గాని ఉచిత విద్యుత్తు గాని ఉచిత బస్సు పథకం గాని అందిస్తుంది. గత 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని పనిని మన ప్రభుత్వం 2 సంవత్సరాలలో చేతలలో చూయిస్తుంది అందువల్ల మన పార్టీ బలపరిచిన అభ్యర్థిని సర్పంచిగా ఎన్నుకోవాలని ధర్మోరా గ్రామ నాయకులకు, మహిళా నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. సుంకర నారాయణ నారాయణ, దొక్కా సాయిల్ , చిన్, కోసం మధు, సుంకర గంగాధర్ , పందిరి నాగేష్ , పందిరి గంగాధర్ , బేగారి భూమయ్య గారు, శంకర్ తదితర నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో చాకలి సాయమ్మ, కుమ్మరి లక్ష్మీ, పల్లికొండ లక్ష్మి, గొల్ల లక్ష్మి, భాగ్య తదితర మహిళా నాయకులు మరియు గుండ్ల ముత్తన్న, సాయిలు, గుండ్ల ఎర్రన్న తదితర నాయకులు, కార్యకర్తలు, మహిళా మణులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## పేరూరు మాజీ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



**వాజేడు, విశాలభారతి:** ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని పేరూరు మాజీ సర్పంచ్ యాలం సరస్వతి టిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు కాకర్లపూడి కళ్యాణ్ బాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో గురువారం ఆమెతోపాటు 20 కుటుంబాల ప్రజలు చేరారు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్న పేరూరు మాజీ సర్పంచ్ యాలం సరస్వతి కి దంతులూరి విశ్వనాథ ప్రసాద్ రాజు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చేరిన సరస్వతి కుటుంబానికి అన్నివేళల కాంగ్రెస్ పార్టీ అండదండలుగా నిలుస్తుందని పేరూరు పంచాయతీ కాంగ్రెస్ కార్యకర్తలు కలిసి మెలిసి అందరిని కలుపుకొని పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లె వెంకన్న, నల్లగాసి రమేష్ ,కురుసం కృష్ణమూర్తి, బొల్లె ఆనందరావు,బొల్లె నరేష్,గార రాంబాబు తోటపల్లి ఎల్లయ్య, కోరం పగిడయ్య, అరికిల్ల రఘుపతి అరికెల చిన్న సమ్మయ్య, తల్లడి శ్రీకాంత్,నవీన్ యాదవ్ ఎర్రావుల నరేష్,తూనూరు జయస్ తదితరులు పాల్గొన్నారు.

## 5 6 తేదీలలో భూపాల్ పల్లి జిల్లా సైన్స్ ఫేర్

**విశాలభారతి భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా స్థాయి సెన్స్ ఫేర్ ఈ నెల 5 మరియు 6 తేదీలలో జరుగనుందని డీ ఈ ఓ ఎం రాజేందర్ జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి తెలిపారు శాంతి నికేతన్ పాఠశాల పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ పక్కన జరగనుందని మొదటి రోజు భూపాలపల్లి ఘనపూర్ రేగొండ మల్హాల్ రావు పలుమెల మహా ముత్తారం పాఠశాల ల విద్యార్థులు రెండవ రోజు 6 తేదీనా చిట్యాల మొగుల్ల పల్లి గోరికొత్తపల్లి కాటారం మహదేవ్ పూర్ టేకుమట్ల మండలాలలోని ఆయా ఉన్నత వివిధ యాజమాన్యాల విద్యార్థులని సైన్స్ ఫేర్ తిలకించడానికి తీసుకురావాలని వారు తెలిపారు.

# గొప్ప సేవలందించిన కొణిజేటి రోశయ్య

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం: విశాలభారతి:** ప్రజా ప్రతినిధిగా కొణిజేటి రోశయ్య గొప్ప సేవలు అందించారని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి సభను ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ఇతర రాష్ట్రాలకు గవర్నర్ గా విశిష్టమైన సేవలు అందించారని తెలిపారు. రోశయ్య రాజకీయ జీవితమంతా ప్రజల సంక్షేమం, నిస్వార్థ సేవకే అంకితమైందని ఆయన సేవలను గుర్తు చేశారు. ఆచరణలో సాధారణత, పరిపాలనలో ప్రతిభ ఆయన ప్రత్యేకతని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తు కోసం కొణిజేటి రోశయ్య ఎన్నో ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## హయత్‌నగర్‌లో చెరువుల కలుషీకరణపై ఆగ్రహం

- చర్యలు శూన్యం అని మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హయత్‌నగర్ పరిధిలోని ప్రధాన చెరువులు నిర్లక్ష్యం, అవినీతి, నిర్వాకంతో తీవ్రంగా కలుషితమవుతున్నాయని మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు . స్థానికంగా ఉన్న కుమ్మరి కుంట, బాతుల చెరువు, ఈదుల్ చెరువు, చింతల్ చెరువులను వాటర్ వర్క్స్, GHMC అధికారులు సక్రమంగా పర్యవేక్షించకపోవడంతో ప్రమాదకర స్థాయిలో కలుషితం చేశారని ఆయన ఆరోపించారు. ప్రజా సంపద అయిన చెరువులను రక్షించాల్సిన వారు, చెరువుల్లో మురుగు నీళ్లు, రసాయన వ్యర్థాలు చేరేలా వ్యవహరిస్తున్నారు. ఇది ఘోరం... దుర్మార్గం... అని సామ తిరుమల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా చెరువులు నల్లగా మారి, దుర్వాసనతో చుట్టుపక్కల ఉన్న కాలనీలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే గ్లోబల్ సిటీ అని మాటలు చెప్పేవారు... కానీ చెరువులను కాపాడే చర్యలు మాత్రం శూన్యం. జనాల ఆరోగ్యం, పర్యావరణం, భూగర్భ జలాలు ప్రమాదంలో పడుతున్నా పట్టించుకోవడం లేదు అని విమర్శించారు. వెంటనే మురుగు నీటి ఎంట్రీలను నిలిపి, చెరువుల శుద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.స్థానిక ప్రజలతో కలిసి త్వరలో పెద్ద ఎత్తున నిరసనలు, ధర్నాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం, GHMC, వాటర్ వర్క్స్ అధికారులు చెరువుల రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సామ తిరుమల రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, కాలనీ వాసులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లష్కర్‌గూడ సర్పంచ్ అభ్యర్థిగా చిత్తరంజన్ గౌడ్ నామినేషన్




**విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** మూడవ విడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామ సర్పంచ్ పదవికి మునుకుంట్ల చిత్తరంజన్ గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మునుకుంట్ల పార్వతమ్మతో పాటు పలువురు గ్రామ పెద్దలు, మద్దతుదారులు చిత్తరంజన్ గౌడ్‌కు తమ ఆశీర్వాదాలు తెలియజేశారు. గ్రామాభివృద్ధి, తాగునీటి సమస్య పరిష్కారం, రహదారి మరమ్మతులు, శుచిత్వం వంటి అంశాలపై కృషి చేయాలని గ్రామ ప్రజలు కోరుకున్నారు.

## ఎస్టిపి నిర్మాణానికి వ్యతిరేకంగా శాంతియుత నిరసన



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ప్రతిపాదిత ఎస్టిపి (మురుగు నీటి శుద్ధి కేంద్రం) నిర్మాణ పనులను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరుతూ కాలనీవాసులు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం శాంతియుత నిరసన తెలిపారు. దండెం రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాలో పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొని, కొత్తగా ప్రతిపాదిస్తున్న ఎస్టిపి నిర్మాణానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా జనావాసాల మధ్యలో మురుగు నీటి శుద్ధి కేంద్రం నిర్మించడం తీవ్ర అన్యాయమని ఆయన విమర్శించారు. ఈదుల చెరువుకు ఆనుకుని ఉన్న 292 సర్వే నంబర్‌లో, అది ఎఫ్‌టిఎల్ పరిధిలో ఉండగా, ఇలాంటి ప్లాంట్‌ను ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎస్టిపి ఏర్పాటు కోసం అనుకూలంగా ఉన్న సర్వే నెంబర్ 83లోని సుమారు 70 ఎకరాల ప్రభుత్వ భూమిని వదిలేసి, చెరువు పక్కన, జనావాసాలకు చేరువలో నిర్మాణాన్ని చేపట్టడం సరైంది కాదన్నారు. భవిష్యత్తులో చుట్టుపక్కల కాలనీల్లో నివసించే ప్రజలు నీటిమలినం, దుర్వాసన తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, ఎస్టిపి నిర్మాణాన్ని జనాభా దూర ప్రాంతానికి మార్చాలని డిమాండ్ చేశారు.ఇది సాధించేవరకు కాలనీవాసులు ఐక్యంగా పోరాడతామని, అవసరమైతే పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని స్థానిక నాయకులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, బాటసింగారం రైతు సహకార సంఘం చైర్మన్ కొత్తపల్లి జయపాల్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పండుగల రాజు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దండెం రామ్ రెడ్డి,స్థానిక కాలనీ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## జాఫర్‌గూడ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన ఎర్ర వెంకటేష్ యాదవ్




**విశాల భారతి,అబ్దుల్లాపూర్ మెట్ :** జాఫర్‌గూడ గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా ఎర్ర వెంకటేశ్ యాదవ్‌తో పాటు 9 మంది వార్డు సభ్యులు గురువారం తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. జాఫర్‌గూడ గ్రామంలో 8 వార్డులు ఉండగా ఒకే ఒక్క వార్డు నుండి ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు, నామినేషన్ దాఖలు కార్యక్రమానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై మద్దతు తెలిపారు. అభ్యర్థి ఎర్ర వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి, శుద్ధి నీటి సరఫరా, కాలువలు, రహదారుల విస్తరణ, పేదల సంక్షేమం వంటి సమస్యల పరిష్కారానికే తాము పోటీలో నిలుస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి మంచి పాలన అందించడం తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమం ప్రశాంతంగా సాగిందని, గ్రామ ప్రజల సహకారంతో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందాలని స్థానిక నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జాఫర్ గూడ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ మణులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆటలతో ఆరోగ్యం, క్రీడలతో భవిష్యత్తు



- సెపక్ తక్రా ఈవెంట్ రాష్ట్ర స్థాయి ఎంపిక క్రీడోత్సవాలు
- నైపుణ్యం ఉన్న ఆటగాళ్లను ఎంపిక చేయాలి

**కురవి, విశాలభారతి:** కురవి మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో 69 వ, సెపక్ తక్రా పోటీలు అండర్ 14, 17, 19 సంవత్సరాలు (బి & జి) విభాగంలో ఎంపిక క్రీడోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథులు మార్గం విజయ పటేల్, కురివి ఎస్ఐ సతీష్, ఐజెయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్,ఎస్జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీ సతీష్ గౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి ఐలయ్య,సెపక్ తక్రా జిల్లా కన్వీనర్.పోరిక అనిల్ కుమార్,ఆర్గనైజర్ మేక దామోదర్ రెడ్డి లు ఈనెల 4 నుంచి 6 వరకు సెపక్ తక్రా ఈవెంట్ రాష్ట్ర స్థాయి ఎంపిక క్రీడోత్సవాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థినీలు నృత్య ప్రదర్శనలతో ముఖ్య అతిథులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. క్రీడలతోనే భవిష్యత్తు ముడిపడి ఉందని కురవి వారు అన్నారు. రాష్ట్ర స్థాయి క్రీడలను కురవి మండల కేంద్రంలో వీరభద్రస్వామి సమక్షంలో ఘనంగా జరుపుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తం నుండి వచ్చిన క్రీడా విద్యార్థిని,విద్యార్థులకు కొరివి మండలం క్రీడలకు వేదిక కావడం చాలా ఆనందంగా ఉందన్నారు.ఈ క్రీడలలో విజయప్రదంలో నడిపిస్తున్న ప్రధానోపాధ్యాయులను,పిటి లనుఅభినందించారు.అనంతరం వారిని ఉపాధ్యాయులు, పీటీలు శాలువాతో సత్కరించారు. నైపుణ్యం ఉన్న క్రీడాకారులను ఎన్నుకుంటే రాష్ట్ర స్థాయిలో వారు నిలుపుతారని పిటీ లను కోరారు. అదేవిధంగా క్రీడల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులు ఎంతో దృఢంగా శక్తివంతంగా ఆరోగ్యంగా ఉంటారని క్రీడల ద్వారా ఉద్యోగాలు వచ్చే అవకాశాలు మెండుగా ఉంటాయని ఆయన అన్నారు. ఈ ఎంపిక క్రీడోత్సవాలను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో, ఆర్ శ్రీనివాస్ రెడ్డి, కే.జితేందర్ నాథ్, జిల్లా సెక్రెటరీ పి.అనిల్ కుమార్,ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బాబు,హెచ్ డబ్ల్యు ఓ సునీత,పద్మ లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో మెజార్టీ స్థానాలు బిఆర్ఎస్ వే



- బడుగుల లింగయ్య యాదవ్
- ఓటమి భయంతోనే నామినేషన్లు వేయకుండా బెదిరిస్తున్నారు
- గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దే
- మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్

**సూర్యాపేట విశాలభారతి:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్న ఏ ఒక్క హామీ అమలు చేయకుండా పారిశ్రామిక వాడలకు ఇచ్చిన భూములను అమ్ముతూ ఐదు లక్షల కోట్ల భారీ కుంభకోణానికి పాల్పడుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. గురువారం జిల్లా బి ఆర్ ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో జరిగే గ్రామపంచాయతీ ఎన్నికల్లో బి ఆర్ ఎస్ అభ్యర్థులు ఘన విజయం సాధించనున్నారని మెజార్టీ పంచాయతీలను బిఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని అన్నారు. గత పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 345 కోట్లు గ్రామాలకు కేటాయించి గ్రామ స్వరాజ్యం తెచ్చారని గ్రామాల్లో ట్రాక్టర్లు, వైకుంఠధామాలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు ఏర్పాటు చేసి అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలకు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేశారని గ్రామాల్లో సెక్రటరీలు సైతం తప్పించుకొని తిరిగే పరిస్థితి నెలకొంది అన్నారు. టిఆర్ఎస్ అభ్యర్థులకు ఎంతో అనుభవం ఉందని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం వారిని బెదిరింపులకు గురిచేస్తూ నామినేషన్ వేయకుండా అడ్డుకుంటూ డబ్బు, మద్యంతో గెలవచ్చనే భ్రమలో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామ పంచాయతీల తో పాటు విద్య, వైద్యం, రోడ్లు దెబ్బతిన్నాయని ప్రజలను పట్టించుకోవడం లేదని రైతులకు బోనస్, గిట్టుబాటు ధర ఇవ్వక పోగా కనీసం వడ్లు పండిస్తే కొనే దిక్కు లేదన్నారు. పెన్షన్లు పెంచుతామని పెంచలేదని, విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని ఇవ్వలేదని, మహిళలకు నెలకు 2500 ఇవ్వలేదని, యువతకు ఉద్యోగాలు లేవని ఇలా ప్రతి రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని మోసం చేసిందన్నారు. హైదరాబాదులో పారిశ్రామిక వాడలకు ఇచ్చిన భూములను అమ్ముకునే ఆలోచన చేస్తున్నారని ఇది 5 లక్షల కోట్ల భారీ కుంభకోణం అని దోచుకో దాచుకో పంచుకో అన్న రీతిలో కాంగ్రెస్ వ్యవహరిస్తుందన్నారు. అవినీతికి పాల్పడుతున్న కాంగ్రెస్ ను కొద్దో గొప్పో స్థానాల్లో గెలిపిస్తే ప్రజలు అవినీతికి లైసెన్స్ ఇచ్చినట్లేనని ప్రజలు ఆలోచించి బిఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిషోర్, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆకుల లవకుశ, జానకిరామ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## బంగారం పెట్టుబడి పేరుతో మోసం చేస్తున్న మహిళ అరెస్ట్

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** బంగారం వ్యాపారం పేరుతో పలువురి నుండి డబ్బులు తీసుకుని మోసం చేసిన మహిళను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేసినట్టు ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపారు.వివరాల్లోకి వెళ్తే.. శ్రీమతి గన్నపురెడ్డి కవిత అలియాస్ కవితా రెడ్డి (40), వృత్తి బోటిక్ వ్యాపారం, నివాసం నాగోల్ లలిత నగర్, తాను బంగారం వ్యాపారం చేస్తున్నానని చెప్పి పెట్టుబడికి డబ్బులు ఇస్తే అధిక లాభాలతో తిరిగి ఇస్తానని చెప్పి వినోద్ అనే పరిచయం ఉన్న వ్యక్తి వద్ద డబ్బులు తీసుకుని నమ్మబలికినట్లు ఇన్స్పెక్టర్ తెలిపారు. ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ వివరించిన ప్రకారం.. గురువారం రోజు హయత్‌నగర్ పోలీసులు కవితా రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరిని మోసం చేసిన కేసులు, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కేసు, ఎల్బీనగర్ పరిధిలో మరో కేసు, సరూరునగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఒక కేసు నమోదైనట్లు చెప్పారు.గతంలో కూడా ఇదే విధంగా మాయమాటలు చెప్పి తెలిసిన వారిని మోసం చేసిన ఘటనపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉందని ఇన్స్పెక్టర్ తెలిపారు. బంగారం పెట్టుబడి పేరుతో డబ్బులు ఇస్తూ మోసపోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

## గ్రంథాలయాన్ని పరిశీలించిన చైర్మన్



**నిజామాబాద్, విశాలభారతి:** బోధన్ టౌన్ బోధన్ పట్టణంలోని గ్రంథాలయాన్ని గురువారం రోజున జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు గ్రంథాలయంలోని వసతులను ఏర్పాట్లను పరిశీలించారు గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగులకు విద్యార్థులకు విద్యార్థినిలకు గ్రంథాలయంలో పోటీ పరీక్షలలో పాల్గొనే విధంగా మెటీరియల్ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో ఇంకా ఏమైనా అవసరం ఉన్నాయో వారిని అడిగి తెలుసుకున్నారు గ్రంథాలయంలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువచ్చినట్లైతే పరిష్కరిస్తానని విద్యార్థిని విద్యార్థులకు నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. పోటీ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు హామీ ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము నిరుద్యోగుల కొరకు ఎంతో కృషి చేస్తుందని, నిరుద్యోగులు కష్టపడి పోటీ పరీక్షల్లో పాల్గొని. తమ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా లైబ్రరీల లో మౌలిక వసతుల కల్పించేందుకు బోధన్ శాసనసభ్యులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహాదారుడు పొద్దుటూరు సుదర్శన్ రెడ్డి ప్రత్యేక చొరవతో గ్రంథాలయాల అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. గ్రంథాలయంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని చైర్మన్ దృష్టికి విద్యార్థిని విద్యార్థులు తీసుకువెళ్లగా అట్టి సమస్యను పరిష్కరించారు.

## జీహెచ్‌ఎంసిగా పెద్ద అంబర్‌పేట్ పురపాలక సంఘం




**విశాలభారతి, పెద్ద అంబర్‌పేట్ :** పెద్ద అంబర్‌పేట్ ప్రాంత అభివృద్ధి పరంపరలో కీలక ముందడుగు పడింది. గురువారం పెద్ద అంబర్‌పేట్ పురపాలక సంఘం కార్యాలయానికి అధికారికంగా 'జీహెచ్‌ఎంసి పెద్ద అంబర్‌పేట్ సర్కిల్' అనే పేరును అధికారులు మార్చి నిర్ణయాన్ని అమలు చేశారు.నూతన పేరుతో ఇకపై అన్ని పరిపాలనా కార్యక్రమాలు, ఫైళ్లు, శాఖల వ్యవహారాలు, ప్రజా సేవా కార్యకలాపాలు నిర్వహించబడనున్నాయి. అధికారిక పత్రాలు, గుర్తింపు బోర్డులు, శాఖల రికార్డులు మొదలైనవి కూడా కొత్త పేరుతో మారుస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.ఈ మార్పుతో పెద్ద అంబర్‌పేట్ ప్రాంతం పాలన, అభివృద్ధి చర్యలు జీహెచ్‌ఎంసి పరిధిలో మరింత వేగవంతం కానున్నాయని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఇక నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ, రోడ్ల మరమ్మతులు, చెత్త నిర్వహణ వంటి కార్యక్రమాల్లో త్వరితగతిన స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టానికి 20 ఏళ్లు... అమలులో లోపం

- డా. చంటి ముదిరాజ్



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** సమాచార హక్కు చట్టం (RTI) అమల్లోకి వచ్చి 20 ఏళ్లు పూర్తైనా, అమలు విధానంలో ప్రభుత్వంలోని నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డా. చంటి ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..ప్రధాన సమాచార కమిషనర్ లేకుండా పనిచేసే పరిస్థితి దేశంలో 11వసారి ఏర్పడింది. చట్టం ప్రభుత్వంలోని అవినీతి, ఎర్రటేపు విధానాలను అరికట్టడానికి ప్రజలకు వజ్రాయుధమని చెప్పారు. సమాచారాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ఉన్న పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు బాధ్యత నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి అని అన్నారు.దేశవ్యాప్తంగా నాలుగు లక్షల కంటే ఎక్కువ RTI అప్పీళ్లు పెండింగ్‌లో ఉండటం చాలా ఘోరం అని వ్యాఖ్యానించారు.సమాచార హక్కు చట్టంలో కేంద్ర ప్రభుత్వం చేసిన సవరణలు కమిషన్ల స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయని తెలిపారు. ప్రజలు RTI ద్వారా ప్రభుత్వ పనితీరును పరిశీలించగలిగే అవకాశం ఉన్నప్పటికీ, అమల్లో చిత్తశుద్ధి లోపిస్తున్నదని డా. చంటి ముదిరాజ్ తెలిపారు. సమాచార హక్కు కోసం పోరాడిన పలువురి పై దాడులు జరగడం, 100కి పైగా మంది మరణించడం దేశానికి మచ్చ అని అన్నారు. సమాచార హక్కు చట్టం సామాన్యుడికి సాధికారతనిచ్చే చారిత్రాత్మక చట్టమని, ప్రజలు మరింతగా దీనిని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని డా. చంటి ముదిరాజ్ పిలుపునిచ్చారు.

## పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ నామినేషన్



**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సిపిఐ పార్టీ తరపున సర్పంచ్ అభ్యర్థిగా కేతరాజు మంజుల గురువారం రోజు నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 8వ వార్డులో వడ్త్యా రమేష్ నాయక్, 14వ వార్డులో నాగేశ్వరరావు తమ నామినేషన్ పత్రాలను అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించారు.నామినేషన్ కార్యక్రమంలో సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా కమిటీ సభ్యులు, స్థానిక పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, పారదర్శక పాలన, పేదల సంక్షేమం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామస్థుల సమస్యలను ప్రతినిధిగా నిలిచేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు సిపిఐ అభ్యర్థులకు విజయం సాధించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిపిఐ పార్టీ కౌన్సిల్ సభ్యులు అందోల్ రవీంద్ర చారి, ముత్యాల యాదిరెడ్డిఅబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్,పెద్ద అంబర్పేట్ మాజీ కౌన్సిలర్ పద్ధతి లక్ష్మణ్ తోపాటు సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శివసేన రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

- రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు పాలడుగు నాగార్జున




**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** వనపర్తి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శివసేన రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి పాలడుగు నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేతలు శివసేన రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.యువజన కాంగ్రెస్ నాయకులు శివసేన రెడ్డి ప్రజా సేవలో మరింత ఎదగాలని, ఆయన కృషి పార్టీ బలోపేతానికి ఎంతో దోహదం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద అంబర్పేట్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పాలడుగు నితిన్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ గ్రీన్ కోర్ ఎగ్జిబిషన్ లో పాల్గొన్న టి.ఐ.టి.ఏ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ

**విశాలభారతి, కామారెడ్డి ;** కామారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ గ్రీన్ కోర్స్(NGC) నిర్వహిస్తున్న వేస్ట్ టు వెల్త్, బెస్ట్ ఫ్రం వేస్ట్ అండ్ ఆర్ట్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ ను కామారెడ్డి లోని CSI పాఠశాలలో నిర్వహించడం జరిగిందనీ ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఉత్తర తెలంగాణ జోన్ సెక్రెటరీ శ్రీకాంత్ అతిథి గా పాల్గొనడం జరిగిందని ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ లో పాల్గొన్న ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు చేసిన ప్రదర్శన స్టాళ్లను వీక్షించారు.

# ఆందోళన అక్కర్లేదు... ఫ్లాట్ యజమానులకు భరోసా

- వాసవీ అర్బన్ వివాదంపై యాజమాన్యం చర్యలు
- వినియోగదారులకు భరోసానిచ్చేలా ప్రణాళికలు
- హ్యాండోవర్ వరకు రూ. 7వేలు చెల్లింపు

**హైదరాబాద్, విశాలభారతి :** బాచుపల్లి వాసవీ అర్బన్ ప్రాజెక్టు విషయంలో కొనుగోలుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదనీ వాసవీ గ్రూప్ యాజమాన్యం భరోసానిస్తోంది. కోవిడ్ కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ప్రాజెక్టు హ్యాండోవర్ కొంత జాప్యం జరుగుతుందనీ, భయాందోళనలకు గురి కావాల్సిన పనిలేదని పేర్కొంది. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్మాణం తలెత్తిన న్యాయపరమైన, ఇతర సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించి, కొనుగోలుదారులకు ప్లాట్లను అప్పగిస్తామని స్పష్టం చేసింది. అదేవిధంగా టీజీ రేరా గడువును కూడా పొడిగించిందనీ, వచ్చే ఏడాది ఆగస్టు వరకు గడువు ఇచ్చిందని నిర్వహకులు పేర్కొన్నారు. హ్యాండోవర్‌లో జరుగుతున్న ఆలస్యానికి తగినట్లుగా పరిహారంగా ఫ్లాట్ యజమానులకు నెలవారీగా రూ. 7000 చెల్లిస్తామని స్పష్టం చేసింది. అప్పటి వరకు ప్రతి ఫ్లాట్ యజమాని సహకరించాలని కోరింది.

ఉద్దేశపూర్వకంగా తమపై జరుగుతున్న దుష్ప్రచారంతో భయపడాల్సిన అవసరమే లేదనీ తెలిపారు. ఇటీవల వాసవీ అర్బన్ ప్రాజెక్టు వద్ద కొనుగోలుదారులు చేసిన ఆందోళన నేపథ్యంలో వాసవీ గ్రూప్ డైరెక్టర్ అభిషేక్ చందా మాట్లాడుతూ పలు విషయాలను ప్రస్తావించారు. ''వాసవీ గ్రూప్ కొనుగోలుదారుల విశ్వసనీయతను పొందిన ఏకైక సంస్థ. అనివార్య కారణాలు, చట్టపరమైన సమస్యలతో ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం జరిగింది. కానీ ఏనాడూ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేసేలా వ్యవహారించలేదు. కొనుగోలుదారుల ఆందోళనతోనే టీజీ రేరా కూడా గడువు పొడిగించింది. అప్పటివరకు ప్రాజెక్టు చట్టబద్ధతను కలిగి ఉంది. ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదు'' అని వివరించారు. ఆగస్టు 30న కొంపల్లిలో కస్టమర్లతో జరిగిన ప్రత్యేక సమావేశం వివరాలను కూడా వెల్లడించారు. అంతర్గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం హ్యాండోవర్ షెడ్యూల్‌ను ప్రకటించారు. అయితే అప్పటివరకు కొనుగోలుదారులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా నెలవారీ చొప్పున ప్రతి ఫ్లాట్ యజమానికి రూ. 7వేలు చెల్లిస్తామన్నారు. చట్టబద్ధంగా ఎలాంటి సంబంధం లేకున్నా... జరిగిన నష్టాన్ని, కొనుగోలుదారుల విశ్వసనీయతను కోల్పోకూడదనే ఉద్దేశంతోనే




చెల్లిస్తున్నామన్నారు.

**ఆర్థిక భారం లేకుండానే ప్రత్యామ్నాయం...**

ప్రాజెక్టులోని బ్లాక్ 9 నిర్మాణం పూర్తి అయిందనీ కంపెనీ వెల్లడించింది. అయితే బ్లాక్8లో కోర్టు కేసు పెండింగ్‌లో ఉండటంతో నిర్మాణ పనులకు అంతరాయం కలుగుతుందన్నారు. అందుకే బ్లాక్8లో ఫ్లాట్లను కొనుగోలు చేసిన వారిపై అదనంగా ఎలాంటి ఆర్థిక భారం మోపకుండానే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. అవసరమైన కస్టమర్లు నిర్మాణం పూర్తైన బ్లాకులోకి మారడానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. దీనికి అదనంగా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయమని స్పష్టం చేశారు. ఒకవేళ బ్లాక్ - 8లో ఫ్లాట్ కొనుగోలు చేసి, నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఆగలేని వారు, నిర్మాణం పూర్తి చేసిన బ్లాకులోని ఫ్లాట్లను తీసుకునే ఆసక్తి ఉంటే... కంపెనీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. జీహెచ్ఎంసీ ఇచ్చే ఓసీలను కూడా త్వరలోనే మంజూరు చేస్తామని, నిర్ణీత గడువులోగా నిర్మాణంలో ఎదురైన ఇబ్బందులను అధిగమించి ఫ్లాట్లను అందజేస్తామన్నారు. అప్పటివరకు కొనుగోలుదారులు సహనంతో సహకరించాలనీ, ఇన్నాళ్లు చూపిన విశ్వాసానికి అనుగుణంగా కంపెనీ సహకారం ఉంటుందనీ వెల్లడించారు.

# ప్రతి ఒక్కరు ప్రతి ఇంటినీ సందర్శించాలి ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈరోజు శంషాబాద్ లో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి రాబోయే సర్పంచ్ ఎలక్షన్లలో అనుసరించవలసిన ఎన్నికల వ్యూహాలు పార్టీ నాయకులు కార్యకర్తలతో చర్చించారు. ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులకు దిశా నిర్దేశం చేశారు. గ్రామ స్థాయిలో పోషించాల్సిన పాత్ర స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మన ప్రభుత్వ హయాంలో అమలు చేసిన, చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించరు. ఓటర్లను కలుసుకోవడం ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త ప్రతి ఇంటినీ సందర్శించి పార్టీని, అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

# మాజీ ముఖ్యమంత్రి కే.రోశయ్య సేవలు చిరస్మరణీయం


- రాష్ట్ర పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు




**గండిపేట్, విశాలభారతి :** మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య సేవలు చిరస్మరణీయమని తెలంగాణ పోలీసు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ చేతన, మురళీధర్, వెంకటేశ్వర్లు,కేఆర్‌కే ప్రసాద్‌లు అన్నారు. తెలంగాణ పోలీసు అకాడమీలో మాజీ ముఖ్యమంత్రి కొనిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా వారు పూలమాలలు వేసి అలంకరించి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రోశయ్య జీవిత విశేషాలు, ఆయన రాజకీయ ప్రస్థానం, ఆంధ్రరాష్ట్రంలో నాడు ఆర్థికమంత్రిగా, ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రగతికి వారు పనిచేసిన విధానంపై గుర్తుచేసుకుని అకాడమీ అధికారులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ లతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు రమణ, భరత్, ఆదూరి శ్రీనివాసరావు,దేవారెడ్డి, సందీప్ రెడ్డి,భాస్కర్,రవీంద్రాజు, కృష్ణ, తోట శ్రీనివాసులు, ఏట యాదమ్మ, రిజర్వు ఇన్స్పెక్టర్ లు మహేష్, శ్రీను, ఫణి, శంకర్, రాజు, రామకృష్ణ, ఆఫీసు సిబ్బంది పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు.

# అయ్యప్ప పాటలతో మారుమోగిన బాలానగర్

**కూకట్ పల్లి, విశాలభారతి:** స్వామియే శరణం అయ్యప్ప పాటలతో బాలనగర్ మారుమోగింది. అయ్యప్పను భక్తిశ్రద్ధలతో పూజించుకుంటూ కరిమ ళవాసుడు అయ్యప్ప స్వామిని కొలుస్తూ బుధవారం బాలానగర్ పరధిలోని అంబికా కాలనీ లో అయ్యప్ప మండల 36వ మహాపడి పూజా మహోత్సవం అల్లంశెట్టి లక్ష్మీనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో పూజా వేడుకలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు.దక్షిణ మూర్తి అయ్యప్ప సేవ సమితి భక్త మండలి సేవాసమాజం ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ పద్ధతిలో మహా పడిపూజ కన్నుల పండుగగా లక్ష్మీనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హర హర సుతన స్వామియే శరణం ఆయప్ప శరణం అంటూ అయ్యప్ప స్వామి శరణు గోషతో అంబికా కలని పురవీధులన్ని మారుమోగాయి. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 300 మందికిపైగా అయ్యప్ప భక్తులు హాజరై శబరిమల అయ్యప్ప స్వామిని ఘనంగా పరిపూర్ణానందంతో పూజించి దైవ ప్రసాదాలు అందుకున్నారు. భక్త మండలి అధ్వర్యంలో స్వాములకు, భక్తులకు అల్పాహార బిక్షను ఏర్పాటు చేశారు.అనంతరం లక్ష్మీనారాయణ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలతో అందరూ ఆయురారోగ్యాలు తో పాటు సుఖ సంతోషాలతో సిరి సంపదలు సిద్దించాలని పరమశివుడిని వెడుక్కొన్నట్లు తెలిపారు.



# ఓటు చోరిపై ఉద్యమం ఉధృతంగా చేపట్టాలి

- ఇందిరమ్మ కమిటీలు కీలకంగా పని చేయాలి
- వార్డుల విభజన అనంతరం పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి
- కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడ్చల్,విశాల భారతి :** మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమావేశం గురువారం జిల్లా అధ్యక్షుడు వజ్రెష్ యాదవ్ నివాసంలో జరిగింది.ఈ కార్యక్రమానికి వివిధ మండల మున్సిపాలిటీల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హాజరయ్యారు.దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకుడు రాహుల్ గాంధీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఓటు చోరి కార్యక్రమాన్ని మేడ్చల్ నియోజకవర్గంలో ఉధృతంగా చేపడుతున్నామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ అన్నారు.అనంతరం వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ డిసెంబరు 8 నాటికి ప్రతి మండలంలో ఓటు చోరిపై 10 వేలకు తగ్గకుండా సంతకాల సేకరణ చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారుల ఎంపిక ఇందిరమ్మ వార్డ్ కమిటిలదే అని వజ్రెష్ యాదవ్ పేర్కొన్నారు.ఇందిరమ్మ కమిటీలు ప్రతి వార్డులో పర్యటించి అర్హులైన వారిని ఎంపిక చేయాలని సూచించారు.అనంతరం గ్రేటర్ లో విలీనమై స్థానిక సంస్థల వార్డుల విభజన ప్రక్రియ జనవరిలో పూర్తి అవుతుందని దానికి అనుగుణంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు అయా వార్డులో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి,తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి,ఏ బ్లాక్,బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,వేణుగోపాల్ రెడ్డి,గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్,పీరజాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ తుంగతుర్తి రవి,ఘట్కేసర్ మాజీ అధ్యక్షులు కర్ర రాజేష్,జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.

# ఏజెన్సీ చట్టాలు వుల్లంగించిన వాళ్లే అభ్యర్థులా?

- ఏజెన్సీ చట్టాలను ఎందుకు విస్మరిస్తున్నారు
- ఏ చట్టాన్ని ఇంప్లిమెంట్ చేశారో అధికారులు సమాధానం చెప్పాలి
- బహుళ అంతస్తులను ఎందుకు నిర్మూలించట్లేదు
- పక్కదారి పట్టిన రాజకీయ విలువలు
- ఆదివాసీ నేత కంగాల రమణకుమారి ఆవేదన



**భద్రాచలం, విశాలభారతి:** భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడా కూడా ఏజెన్సీ చట్టాలను అమలు చేయని పరిస్థితి కనిపిస్తుందనీ భద్రాచలం పట్టణంలో అతివేగంగా బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టటం వెనక ఉన్న కుట్ర తేటతెల్లం అవుతుందనీ మహాజన సమితి ఆదివాసి మహిళా రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ఆవేదన వ్యక్తపరిచారు ఈ సందర్భంగా ఆమె ఓ ప్రకటన విడుదల చేస్తూ భద్రాచలం పట్టణ ప్రాంతంలో ఎక్కడ చూసిన బహుళ అంతస్తులు పుట్టగొడుగుల్ల వెలుస్తున్నాయని దీని వెనుక ఎవరి హస్తం ఉంటుందో ఆదివాసులు గమనించాలని ఆమె అన్నారు 1/70 చట్టం ఉన్నా కూడా భద్రాచలంలో అమలకు నోస్కోకపోవడం అత్యంత దారుణమని కంగాల రమణకుమారి మండిపడ్డారు ఎల్ టి ఆర్ కేసులు నమోదు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తూ ఒక బలమైన ఆదివాసుల చట్టాలను తుంగలో తొక్కటం అత్యంత దారుణమని ఆమె పేర్కొన్నారు సామాన్య ఆదివాసి ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుందని కొంతమంది మాత్రమే లబ్ధి పొందటం సరైనది కాదని ఆమె మండిపడ్డారు అధికారులు క్షేత్ర స్థాయిలో ఆదివాసి కుటుంబాలకు జరుగుతున్న అన్యాయంపై సర్వే నిర్వహించి ప్రతి ఒక్క కుటుంబానికి ఆర్థిక సామాజిక రంగాల్లో అభివృద్ధిని సాధించాలని ఆమె తెలిపారు అనేక ఆదివాసి చట్టాలకు ముసుకు వేస్తున్నారని అడ్డదారిలో కోట్ల రూపాయలు సంపాదించి చట్టాలను ఉల్లంఘించిన వాళ్లే రాజకీయాల్లో రాణిస్తున్నారని అటువంటి అవినీతి అక్రమాలు చేసే వారే ఎన్నికల్లో పోటీ చేస్తే చట్టాలను ఎవరు కాపాడాలని ఆమె అన్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు ఆదివాసుల చట్టాలకు జరుగుతున్న అన్యాయంపై ఒక నివేదిక తయారు చేసి వారి పైన కఠినమైన చర్యలు తీసుకొని ఆదివాసి చట్టాలను కాపాడాలని ఆమె అధికారులను కోరారు.

# డిసెంబర్ 7న ప్రజా వంచన దినం

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు తీవ్ర విమర్శలు
- ప్రజా పాలన ఉత్సవాలను పూర్తిగా బహిష్కరిస్తున్నాము
- ఉత్సవాల పేరుతో ప్రజలకు మరింత మోసం చేసే ప్రయత్నం
- హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజలు నిరాశలో ఉన్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాలు ఎంతో భారీగానే ఉన్నాయి
- డిసెంబర్ 7ని ప్రజా వంచన దినంగా ప్రకటిస్తున్నాము
- ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజల ముందు బహిర్గతం చేస్తాం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :** తెలంగాణలో కాంగ్రెస్ పాలన మొదలై రెండేళ్లు పూర్తి కావడానికి మరో మూడు రోజులు మాత్రమే ఉన్న సమయంలో, రాష్ట్ర బీజేపీ నేతలు తీవ్ర ఆక్షేపాలు లేవనెత్తారు. డిసెంబర్ 7న ప్రభుత్వం నిర్వహించాలనుకునే ప్రజా పాలన ఉత్సవాలను పూర్తిగా బహిష్కరిస్తామని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఈ. రామ్‌చందర్ రావు స్పష్టం చేశారు. ఈ ఉత్సవాలు ప్రజలకు మరింత మోసం చేసే ప్రయత్నమేనని, రెండేళ్ల పాలనలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజలు నిరాశలో మునిగారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ సందర్భాన్ని ప్రజల ముందు ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేసే అవకాశంగా చూస్తున్నారు. రామ్‌చందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో చేసిన మోసాలు ఎంతో భారీగానే ఉన్నాయని, అందుకే ప్రజా పాలన ఉత్సవాలు అనేది ఒక నాటకీయ ప్రదర్శన మాత్రమేనని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక స్థిరత్వం లేకపోవడం, ఉపాధి అవకాశాలు తగ్గడం, వ్యవసాయికుల సమస్యలు పరిష్కారం కాకపోవడం వంటి అంశాలు ప్రభుత్వం దృష్టిలో ఉండకపోవడాన్ని ఆయన ఎత్తి చూపారు. ఈ రెండేళ్లలో ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు మర్చిపోకూడదని, బీజేపీ ప్రతి ఒక్కరి ముందు ఈ వాస్తవాలను ప్రకటించాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ప్రజలతో చర్చలు నిర్వహించాలని సూచించారు. డిసెంబర్ 7నే ప్రజా వంచన దినంగా ప్రకటించి, రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని రామ్‌చందర్ రావు ప్రకటించారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజల ముందు బహిర్గతం చేసి, వారిని మేల్కొల్పాలనే లక్ష్యంతో బీజేపీ ముందుంచుకుంది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమన్వయంగా నిరసనలు జరపనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ నిరసనలు ప్రజలలో అవగాహన పెంచి, ప్రభుత్వంపై ఒత్తిడి తీర్చిదిద్దాలని బీజేపీ భావిస్తోంది. హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పూర్తి ఛార్జ్‌షీట్ విడుదల చేస్తామని రామ్‌చందర్ రావు పేర్కొన్నారు. ఈ ధర్నాలో ప్రజల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలు వివరంగా చేర్చిన రిపోర్ట్‌ను ప్రస్తావించి, రాజకీయ పరిస్థితుల్లో మలుపు తీసుకురావాలనే ప్రయత్నం జరుగుతుంది. బీజేపీ కార్యకర్తలు, స్థానిక నేతలు పాల్గొనే ఈ కార్యక్రమం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చనీయాంశంగా మారనుంది. ఈ ఛార్జ్‌షీట్ ద్వారా ప్రభుత్వం ఎదుర్కొనే ఒత్తిడి మరింత పెరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బీజేపీని భూస్థాపితం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని, ప్రజలే కాంగ్రెస్ పార్టీని పాతరేయడం ఖాయమని బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు మండిపడ్డారు. బీజేపీని భూస్థాపితం చేయడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో హెల్త్, ఎడ్యుకేషన్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఏ విషయంలోనూ అన్యాయం చేయలేదని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ''ఫ్యూచర్ సిటీ కడతమని ఎవరిని అడిగి నిర్ణయం తీసుకున్నరు? మీ సొంత నిర్ణయాలకు కేంద్రం నిధులు ఎట్లా ఇస్తది?'' అని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీకి నిధులు ఇవ్వకపోతే బీజేపీని బొందపెడతామని సీఎం అనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేకనే.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో అవినీతి బినామీల పేరు మీద జరిగిందని, ఇది దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని ఆరోపించారు. డిజిటల్ ఇండియాలో భాగంగా వచ్చిన 'సంచార్ సాథి' యాప్‌పై కూడా కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ నంబర్ వన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, ఈ సందర్భంగా నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ నేతలు మంజుల, బండారు రవీందర్,బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నగేశ్ తదితరులు బీజేపీలో చేరారు. హిందూ దేవుళ్లను, హిందూ సమాజాన్ని కించపరిచేలా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారని.. దీన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు, సీఎం దిష్టిబొమ్మ దహన కార్యక్రమాలు చేపట్టాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

# వివాహ విందులో దుప్పుల మాంసం

- అర్బన్ పార్క్‌లో దుప్పుల వేటకు రఘును ప్రధాన నిందితుడిగా ఎఫ్ఐఆర్ నమోదు
- వేట చేసిన దుప్పుల మాంసమే రఘు వివాహ విందుకు తరలించినట్టు అటవీశాఖ నిర్ధారణ
- ముందుగా అరెస్టైన ఇద్దరూ ఇదే వేట శ్రేణికి సహకరించిన కోణంలో వ్యవహరించారని అధికారులు స్పష్టం



**అశ్వరావుపేట, విశాలాభారతి:** అశ్వరావుపేట నియోజకవర్గం బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు తనయుడు రఘు వివాహ విందులో దుప్పుల మాంసం వడ్డించిన ఘటనపై నెలకొన్న అనుమానాలకు చివరకు తెరలేచింది. వన్యప్రాణులను వేటాడిన ప్రధాన నిందితుడు రఘేనని దర్యాప్తులో తేలడంతో, సత్తుపల్లి అటవీశాఖ రఘును నిందితుడిగా పేర్కొంటూ అధికారికంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ మేరకు అర్బన్ పార్క్ దుప్పుల వేట ఘటనతో వివాహ విందు దుప్పుల మాంసం సరఫరా మధ్య సంబంధం స్పష్టమైంది.

ప్రాథమిక విచారణలో ఐదు దుప్పులను తుపాకులతో కాల్చి హతమార్చినట్టు నిర్ధారణ కాగా, వాటిని రఘు వివాహ విందుకు తరలించి మాంసం వడ్డించిన విషయం వెలుగులోకి వచ్చింది. విస్తృతంగా ఆహ్వానాలు ఉన్న ఈ విందుకు వన్యప్రాణుల వేటతో మాంసం సేకరించినట్టు అటవీశాఖ నిర్ధారించడంతో, రఘుపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద పలు ఆరోపణలు నమోదు చేశారు.

ఈ పరిణామానికి ముందు సత్తుపల్లి నీలాద్రి అర్బన్ పార్క్ పరిసరాల్లో జరిగిన దుప్పుల వేట కేసులో ప్రైవేట్ ఉద్యోగి గోపికృష్ణ, రాంప్రసాద్‌లను అదుపులోకి తీసుకోవడం, వారిని రిమాండ్‌కు పంపడం ప్రజల్లో అనుమానాలు రేకెత్తించింది. వేట జరిగిన రాత్రి 'వారాహి' స్టిక్కర్ ఉన్న వాహనం పార్క్‌లోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయినప్పటికీ, అప్పటివరకు ఆ వాహనం యజమాని, ప్రయాణికులు ఎవరో వెల్లడించకపోవడంతో దర్యాప్తుపై విమర్శలు వినిపించాయి. అయితే తాజాగా రఘుపైనే కేసు నమోదు కావడం వల్ల ఈ ఇద్దరిని అరెస్టు చేయడం కూడా ఇదే వేట శ్రేణికి సంబంధించి, నేరానికి సహకరించిన కోణంలోనని అధికారులు స్పష్టంచేశారు. రెండు ఘటనలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయని, అర్బన్ పార్క్‌లో వేట జరిగిన రాత్రి అక్కడి నుండి తీసుకువెళ్లిన దుప్పులే తదుపరి రోజున జరిగిన వివాహ విందులో ఉపయోగించబడ్డాయని అటవీశాఖ విచారణలో తేలింది.

ఎఫ్ఐఆర్ నమోదు అయిన నేపథ్యంలో దర్యాప్తు గోప్యత, సీసీ కెమెరా ఫుటేజీ విడుదల ఆలస్యం, కీలక వ్యక్తుల వివరాల ప్రకటనలో వచ్చిన అపార్థాలు ప్రజల్లో కలిగించిన అనుమానాలు ఇప్పుడు తగ్గుముఖం పట్టాయి. అయితే వన్యప్రాణి సంరక్షణలో కీలక పాత్ర పోషించాల్సిన అటవీశాఖ ఇంత పెద్ద సంఘటనలో ప్రారంభ దశలలో స్పష్టత చూపకపోవడంపై పర్యావరణ ప్రేమికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు.వేట ఎలా జరిగింది? ఆయుధాలు ఎక్కడి నుండి వచ్చాయి? వేటలో ఇంకెవరెవరు పాల్గొన్నారు? వాహనాల ప్రయాణ వివరాలు ఎలా ఉన్నాయో అన్న అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. వాస్తవ నిందితుడు రఘేనని తేలడంతో కేసు మిస్టరీ వీడినప్పటికీ, సహనిందితుల పాత్ర, వేట నిర్వహణ పద్ధతి, వన్యప్రాణుల మాంసం సరఫరాలో ఉన్న మరింత కీలక విచారణ జరగాల్సి ఉంది.

“దర్యాప్తులో రఘు ప్రధాన వేటగాడిగా నిర్ధారణ కావడంతో, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ సెక్షన్లు అమలయ్యాయి. కనీసం 3-7 ఏళ్ల జైలు, వాహనాల స్వాధీనం, భారీ జరిమానాలు తప్పవని అధికారులు తెలిపారు”అర్బన్ పార్క్ నుంచి వివాహ విందు వరకు దుప్పుల వేటకు సంబంధించిన మొత్తం కథనం స్పష్టమవుతుండడంతో, ఈ కేసు ఖమ్మం జిల్లాలో అతిపెద్ద వన్యప్రాణుల వేట కుంభకోణంగా మారింది. అధికారులు పూర్తి నివేదిక విడుదల చేయాలని, ఈ కేసుకు సంబంధించి ఎవరైనా మినహాయింపు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అసత్య ప్రచారాలు చేస్తే కఠిన చర్యలు


- పట్టణ సీఐ శివశంకర్



దశ, విశాలభారతి: సోషల్ మీడియా ద్వారా సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత వ్యాఖ్యలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం తన కార్యాలయంలలో మాట్లాడుతూ. ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఏదైనా పోస్టులు, వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరులకు హాని కలిగించవద్దన్నారు. ఏదైనా వర్గాన్ని కించపరిచేలా తెలియని సమాచారాన్ని పోస్ట్ చేయడం షేర్ చేయడం నేరంగా పరిగణించబడుతుందని అన్నారు. ఏ గ్రూపులోనై ఇలాంటి పోస్టులు షేర్ అయితే, ఆ గ్రూప్ అడ్మిన్ కూడా బాధ్యుడిగా పరిగణిస్తామని తెలిపారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేసి 24/7 పర్యవేక్షణ వుంటుందని తెలిపారు. అనుచిత పోస్ట్ లు ఫార్వర్డ్ చేసిన వారిపైన కేసులు నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. అందువలన సామాజిక మాధ్యమాలను సమాజానికి మంచిని చేకూర్చే విధంగా మాత్రమే ఉప యోగించుకోవాలని, నిబంధనలను అతిక్ర మించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోదాడ పట్టణ సీఐ శివ శంకర్ హెచ్చరించారు.

# బాలుడి హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

**ఆసిఫాబాద్, విశాల భారతి :**



తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన బాయి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వెలుగు చూసిన బాలుడి హత్య కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. అరుణబాయి కి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం కాగా, కుమారుడు దుర్గం ఉదయ్ కిరణ్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బోర్కుంట తరుణ్ ప్రేమ పేరుతో వేధింపులు చేస్తూ వచ్చాడని ఫిర్యాదుదారురాలు వివరించారు. తన కూతురిని ఇబ్బందిపెట్టొద్దని పలుమార్లు హెచ్చరించినా తరుణ్ వినకుండా వేధింపులను కొనసాగించినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు శ్రీదేవిని బంధువుల ఇంటికి పంపించినా, అక్కడకూ వెళ్లి తరుణ్ వేధింపులు కొనసాగించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. అరుణబాయి ఉపాధి హామీ పని నిమిత్తం వెళ్లగా, అదను చూసి ఇంట్లో నిద్రలో ఉన్న ఉదయ్ కిరణ్‌పై నిందితులు (తరుణ్, నరుణ్) దాడి చేసి గొంతు నొక్కి హత్య చేసినట్టు విచారణలో తేలిందన్నారు. ఈ ఘటనపై తిర్యాణి ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేయగా, తదుపరి దర్యాప్తును రెబ్బెన సిఐ అల్లం నరేందర్ కొనసాగించారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్మోహన్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టగా, నేరం రుజువు కావడంతో ప్రిన్సిపల్ అండ్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. రమేష్ నిందితులపై శిక్షలను ఖరారు చేసినట్లు పేర్కొన్నారు.A1 బోర్కుంట తరుణ్‌కు జీవిత ఖైదు మరియు రూ.28,000 జరిమానా, A2 దుర్గం నరుణ్‌కుమార్‌కు జీవిత ఖైదు, రూ.26,000 జరిమానా విధించినట్టు ఎస్పీ తెలిపారు.




# కూల్ పోస్టర్‌తో రెండో సాంగ్ డేట్ వచ్చేసింది!

మెగాస్టార్ చిరంజీవి హీరోగా నయనతార హీరోయిన్ గా దర్శకుడు అనీల్ రావిపూడి తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రమే "మన శంకర వరప్రసాద్ గారు". వచ్చే ఏడాది సంక్రాంతి రేస్ ని టార్గెట్ చేస్తూ వస్తున్న ఈ సినిమా నుంచి ఆల్రెడీ వచ్చిన మీసాల పిల్ల సాంగ్ సెన్సేషనల్ హిట్ అయ్యింది. ఇక నెక్స్ట్ సాంగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురు చూస్తుండగా మేకర్స్ ఒక కూల్ పోస్టర్ తో దీనిపై అప్డేట్ ఇచ్చేసారు. చిరంజీవి నయనతార లు మంచి స్టైలిష్ అండ్ గ్లామర్ లుక్ లో కనిపిస్తున్న ఈ పోస్టర్ తో మరో చార్ట్ బస్టర్ గ్యారెంటీ అనిపిస్తుంది. ఇక ఈ సాంగ్ అనుకున్నట్టుగానే శశిరేఖ అనే పేరిటే వస్తుంది. మరి భీమ్స్ ఈసారి ఎలాంటి ట్యూన్ అందించాడో తెలియాలి అంటే ఈ డిసెంబర్ 8 వరకు ఆగాల్సిందే. ఇక దీనికి సమయం ఆ ముందు రోజు రివీల్ కానుంది. ఈ చిత్రానికి షైన్ స్క్రీన్ వారు నిర్మాణం వహిస్తుండగా విక్టరీ వెంకటేష్ కూడా కీలక పాత్ర ఇందులో పోషిస్తున్నారు.

# స్పిరిట్‌కి బ్రేకిచ్చిన రాజాసాబ్..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ఇపుడు పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ చిత్రాల్లో దర్శకుడు సందీప్ రెడ్డి వంగతో లాంగ్ అవైటెడ్ గా ఉన్న చిత్రం "స్పిరిట్" కూడా ఒకటి. చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఈ సినిమా ఫైనల్ గా షూటింగ్ మొదలు పెట్టుకోగా ఈ కొంతలోనే రాజాసాబ్ సినిమాకి బ్రేక్ ఇచ్చాడట. అయితే ఈ అంతటికి కారణం తన లాస్ట్ బ్లాక్ బస్టర్ హిట్ చిత్రం కల్కి 2898 ఎడి. మరి ఈ సినిమా రిలీజ్ సమయంలో ప్రభాస్ మిస్ అయ్యాడు. దీనితో నెక్స్ట్ టైం వస్తానని చెప్పాడు. ఇక ఇపుడు బాహుబలి ది ఎపిక్ రిలీజ్ కోసం అక్కడ స్పెషల్ ప్రీమియర్స్ కోసం పయనమయ్యాడు. బాహుబలి ది ఎపిక్ అక్కడ రిలీజ్ కాబోతుండగా అక్కడి ఆడియెన్స్ కి ఇచ్చిన మాట ప్రకారం వెళుతున్నాడు. దీనితో ఆ సినిమా ప్రమోషన్స్ కోసం జపాన్ పయనమైనట్టు తెలుస్తుంది. అక్కడ బాహుబలి ది ఎపిక్ సినిమా డిసెంబర్ 12న గ్రాండ్ గా విడుదల కాబోతుంది. దీని తర్వాత మళ్ళీ మిగతా సినిమాల షూట్ లో ప్రభాస్ పాల్గొననున్నాడు.





# శ్రీమతిగా ఏడాది అంటూ శోభిత వీడియో

నాగ చైతన్య, శోభిత ధూళిపాళ మూడు మూళ్ళ బంధంతో ఒకటై ఏడాది పూర్తయింది. గతేడాది డిసెంబర్ 4న వీరిద్దరూ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. మొదటి వార్షికోత్సవం సందర్భంగా శోభిత స్పెషల్ వీడియోను షేర్ చేశారు. 'నేను ఎంతో ప్రేమించిన నాగచైతన్యతో ఏడడుగులు వేసి ఏడాది అయింది. 'చైతు నా జీవితంలోకి వచ్చాకే జీవితం పరిపూర్ణ మైంది' అని ఆ వీడియోలో పేర్కొన్నారు. 'శ్రీమతిగా ఏడాది' అంటూ పెళ్లి నాటిసంగతులు గుర్తుచేసుకుంటూ వీడియోను షేర్ చేశారు. 'నీ ప్రయాణంలో భాగం కావడం నా అదృష్టం మై లవ్. హ్యాపీ యానివర్సరీ' అని శోభిత పోస్ట్ కు నాగ చైతన్య రిప్లై ఇచ్చారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.